PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 255 | విజయవాడ, మంగళవారం 18 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 18 April 2023 | Rs

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

- సిఐడి చర్యకు నిరసన

• లోపలి పేజీలో.. •

ప్రమోద్ - సుకాంత్‌కు స్వర్ణం

- పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్

బ్రెసిలియ (బ్రెజిల్): ఇక్కడ జరుగుతున్న పారా బాడ్మింటన్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల డబుల్స్ జోడీ స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. పురుషుల డబుల్స్ ఫైనల్లో పారా ఒలింపిక్స్ ఛాంపియన్ ప్రమోద్ భగత్(ఎస్-ఎల్-3)-సుకాంత్ కదమ్(ఎస్‌ఎల్-4) జోడీ 22-20, 21-19తో కొరియాకు చెందిన జో డోంగీ-షిన్ క్యుంగ్‌లపై గెలిచారు. ఇక సింగిల్స్‌లో ప్రమోద్(ఎస్‌ఎల్-3)లో ఫైనల్లో 12-21, 13-21తో భారత్‌కే చెందిన నితేష్ చేతిలో ఓడి రజిత పతకానికే పరిమితమయ్యాడు.

సత్యపాల్ మాలిక్ ఆరోపణలపై మోడీ ప్రభుత్వం జవాబు చెప్పాలి

- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : జమ్ము కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చేసిన తీవ్రమైన ఆరోపణలపై మోడీ ప్రభుత్వం స్పష్టమైన సమాధానమిచ్చి, తన నిజాయితీని నిరూపించుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. పొలిట్‌బ్యూరో సోమ వారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 40మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయిన పుల్వామా ఘటనపై వచ్చిన ఆరోపణలు మన దేశ భద్రతకు సంబంధించినవి, చాలా తీవ్రమైనవి అని పొలిట్‌బ్యూరో పేర్కొంది. మన జాతీయ భద్రత పరిరక్షణలో లోపాలను ఎంతమాత్రం విస్మరించడానికి వీల్లేదని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఎ అధికరణలు రద్దు చేసిన తీరు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని విభజించిన వైనంపై వచ్చిన ఆరోపణలూ అంతే తీవ్రమైనవి. ఈ అంశాలపై మోడీ ప్రభుత్వం మౌనం పాటించడం మన జాతీయ భద్రతకు, మన దేశ సమైక్యత, సమగ్రతలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మన దేశ భద్రతా ప్రయోజనాలు, రాజ్యాంగ పవిత్రతను దృష్టిలో వుంచుకుని మోడీ ప్రభుత్వం ఈ ఆరోపణలన్నింటికీ జవాబివ్వాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

ఉక్కు ప్రయివేటీకరణకు కుట్ర

- 'బిజెపి రెండు నాల్కల ధోరణి'పై సిహెచ్ నర్సింగరావు ధ్వజం

• లోపలి పేజీలో.. •

ఏం చేద్దాం..!

ముఖ్యనేతలతో సిఎం సమావేశం

వరుస కేసులతో ఉక్కిరిబిక్కిరి

రెండూ కేంద్ర దర్యాప్తు సంస్థలే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా వైఎస్ భాస్కరరెడ్డి అరెస్టు, ఎంపి అవినాష్‌ను కూడా అరెస్టు చేస్తారనే వార్తలు, కోడి కత్తి కేసు విచారణ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. దీనికి వై.వి.సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి వంటి నేతలు హాజరయ్యారు. దీనికోసం సిఎం కొన్ని అధికారిక పర్యటనలు రద్దు చేసుకున్నారు. అవినాష్‌ను సిబిఐ అరెస్టు చేస్తే తరువాత ఎలా స్పందించాలనే అంశంపై కీలక నేతలతో సిఎం చర్చించినట్లు తెలిసింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో భాస్కరరెడ్డి అరెస్టు జరిగిన తీరుపై చర్చించారు. సిబిఐ దూకుడును కోర్టు ద్వారా అడ్డుకోవాలనే అంశంపైనా చర్చించారు. మరోవైపు కోడికత్తి కేసు కూడా విచారణకు వచ్చింది. ఊహించని పరిణామాలతో వైసిపి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. రెండు కేసుల్లో కేంద్ర ఏజెన్సీలే విచారణ చేస్తుండటంతో ముఖ్య నేతలకు ఊపిరిసలపని విభాగంలో పట్టున్న కర్ణాటకకు చెందిన ఇద్దరిని హుటాహుటిన పిలిపించి చర్చించారని, బెయిల్ వస్తుందనే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. అయితే విచారణకు రావాలని కడప ఎంపి అవినాష్‌రెడ్డికి సిబిఐ నోటీసు జారీచేసిన నేపథ్యంలో ఆయన హైదరాబాద్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం దీనిపై విచారించిన న్యాయమూర్తి అవినాష్‌ను అరెస్టు చేసే అంశంపై సిబిఐ న్యాయవాదులను ప్రశ్నించారు. నిందితుడిగా చేర్చినందున ఏ క్షణంలో అయినా అరెస్టు చేసే

ఖాదర్‌భాషాకు ఖర్జూరం తినిపిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

- వార్త 2లో..

పరిస్థితి ఎదురైంది. సోమవారం ఉదయం కోడికత్తి కేసు విచారణ మొదలవగానే సిఎం పెట్టుకున్న పిటిషన్‌ను అంగీకరిస్తారా, లేక కచ్చితంగా కోర్టుకు రావాలంటారా అనే విషయంపై సంశయంలో పడ్డారు. ఎన్ఐఎ ఈ కేసులో ఇక విచారణ అవసరం లేదని చెప్పింది. అవినాష్‌ను అరెస్టు చేస్తారనే ముందస్తు సమాచారం ఉండటంతో న్యాయ అవకాశం ఉందని కోర్టుకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారానికి వాయిదా వేసిన జడ్జి విచారణ పూర్తయ్యే వరకూ అంటే సాయంత్రం నాలుగు గంటల వరకూ అరెస్టు చేయొద్దని సూచించారు. దీంతో సిబిఐ వెంటనే అవినాష్‌రెడ్డికి మరో నోటీసు ఇచ్చింది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు విచారణకు రావాలని సూచించింది. ఈ అంశాలన్నిటినీ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సిఎం, ఇతర ముఖ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మంగళవారం కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే ఏమి చేయాలనే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది.

ఏమి చెప్పాలో తెలియని సందిగ్ధత

ఈ కేసులో బాధిత కుటుంబం, నిందితులుగా పేర్కొంటున్న కుటుంబాలు రెండూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంత కుటుంబాలే. భాస్కరరెడ్డి అరెస్టుతో కొంత షాక్‌కు గురైన కీలక నాయకులు మొత్తం రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఒక నిర్ణయానికి రాలేకపోయారు. దీనిపై సోమవారం సుదీర్ఘంగా చర్చించినా ఎలా స్పందించాలనే అంశంపై ఒక నిర్ణయానికి రాలేకపోయినట్లు తెలిసింది. అయితే కోడికత్తి కేసు 20కి వాయిదా పడటం, అవినాష్ కేసును మంగళవారం చేపట్టనుండటంతో ఉత్కంఠ అలాగే కొనసాగుతోంది. ఒకవేళ అవినాష్‌ను అరెస్టు చేస్తే రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. ఈ గందరగోళం జరుగుతున్న సమయంలోనే కడపకు చెందిన టిడిపి మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి (రవీంద్రారెడ్డి) గన్‌మెన్లను తొలగించడంతో టిడిపి నేతల్లో ఆందోళన నెలకొంది.

వారిద్దరి నుంచి నాకు ప్రాణహాని : దస్తగిరి

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల (వైఎస్ఆర్ జిల్లా)

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి నుంచి తనకు ఇప్పటికీ ప్రాణహాని ఉందని వైఎస్.వివేకానంద హత్య కేసు అప్రూవర్ దస్తగిరి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన వైఎస్ఆర్ జిల్లా ఎర్రగుంట్లలో విలేకర్లతో మాట్లాడారు. ఎర్ర గంగిరెడ్డి చెప్పిన మేరకే వివేకానందను హత్య చేయడంలో సహాయం చేశానని తెలిపారు. ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని వైఎస్.అవినాష్‌రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రొద్దుటూరులో తాను అప్రూవర్‌గా మారి వాంగ్మూలం ఇచ్చిన మరుసటి రోజు అవినాష్‌రెడ్డి, ఇతరులు కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. ఇప్పుడు అరెస్టులు జరుగుతున్నాయి కాబట్టి నాపైనా, సిబిఐపైనా, సునీతపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

అవినాష్ బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

• లోపలి పేజీలో.. •

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల

ప్రొబేషన్ డిక్లేర్

- మే 1 నుంచి పే స్కేలు అమలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2020 సంవత్సరంలో రెండో విడతలో ఎంపికైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ కాలాన్ని డిక్లేర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి జిఓ ఎంఎస్ నెంబరు 3ను సోమవారం ప్రభుత్వం విడుదల చేసింది. ప్రొబేషన్ డిక్లేర్‌తో సుమారు 17 వేలమంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు లబ్ధిచేకూరనుంది. వారికి 2023 మే 1 నుంచి పే స్కేలు వర్తించనుంది. అర్హులైన అభ్యర్థులు గ్రామ, వార్డు సెక్రటేరియట్ కార్యనిర్వాహకుల పోస్టులకు రిక్రూట్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తూ సంబంధిత మాతృశాఖల ద్వారా నోటిఫికేషన్‌లు జారీ చేశారు. ఎంపికైన అభ్యర్థులు రెండేళ్ల కాలం రూ.15 వేల వేతనానికి విధులు నిర్వహించారు.

మాతృశాఖలైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, రెవెన్యూ, వ్యవసాయం, సహకారం, పశుసంవర్థకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్ అండ్ ఫిషరీష్, హోమ్, హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ల కింద పరీక్షలు నిర్వహించినట్లు జిఓలో స్పష్టం చేశారు.

ఇఎపిసెట్‌కు 3.3 లక్షల మంది దరఖాస్తు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్)కు ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య పెరిగింది. మార్చి 10 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 15తో ముగిసింది. ఈ ఏడాది 3,30,229 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 2,33,027 మంది, బైపిసి విభాగానికి 97,202 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈసారి అదనంగా 30,145 దరఖాస్తులు వచ్చాయి. రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 30 వరకు, రూ.1000తో మే 5 వరకు, రూ.5 వేలతో మే 12 వరకు, రూ.10 వేలతో 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం అభ్యర్థులకు ఉంది. మే 15 నుంచి 18 వరకు ఎంపిసి విభాగం అభ్యర్థులకు, మే 22, 23 తేదీలలో బైపిసి విభాగం అభ్యర్థులకు పరీక్షలు రెండుపూటలా ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. మే 5న జరగనున్న ఇసెట్‌కు 39,170 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సంక్షోభంలో మణిపూర్ ప్రభుత్వం

ఢిల్లీకి బిజెపి రెబల్ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఎన్.బీరేందర్ సింగ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం సంక్షోభంలో పడింది. 10 నుంచి 12 మంది పార్టీ ఎమ్మెల్యేలు రాజధాని ఢిల్లీకి చేరుకున్నారు. ముఖ్యమంత్రిని మార్చాలని లేదా రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు చేయాలని వారు పార్టీ అధినాయకత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అసమ్మతి ఎమ్మెల్యేలలో కుకీ తెగకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు.

కుకీ తెగకు చెందిన తిరుగుబాటుదారులపై పోలీసు చర్యను నిలిపివేస్తూ 2008లో అప్పటి ప్రభుత్వంతో ఒక ఒప్పందం కుదిరింది. బీరేందర్ సింగ్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని గత నెలలో రద్దు చేసింది. దీనిపై కుకీ తెగకు చెందిన స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. తమపై పోలీసులు ఉక్కుపాదం మోపడం వల్ల ప్రతిరోజూ ఇబ్బందులు పడుతూనే ఉన్నామని వారు తమ తెగకు చెందిన ఎమ్మెల్యేల దృష్టికి తెచ్చారు. 'ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా కారణంగా మణిపూర్‌లో, ఈశాన్య ప్రాంతంలో బిజెపి బలపడింది. ఇప్పుడు

మణిపూర్ సిఎం ఎన్.బీరేందర్ సింగ్

బిజెపి రాష్ట్ర నాయకత్వం వల్ల మేము ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడి నాయకత్వం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడం లేదు. నిరంకుశంగా ప్రవర్తిస్తోంది. 2024 ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం లభించాలని మేము కోరుకుంటున్నాం' అని పేరు చెప్పడానికి ఇష్టపడని తిరుగుబాటు ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. మణిపూర్ బిజెపి ఎమ్మెల్యే కరమ్ శ్యామ్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రికి పంపారు. తనకు ఎలాంటి బాధ్యతలు అప్పజెప్పలేదని, ఈ పదవి అలంకారప్రాయంగా ఉందని ఆయన చెప్పారు.

గుజరాత్‌లో నరబలి

- తమకు తామే ప్రాణాలర్పించిన జంట

అహ్మదాబాద్ : గుజరాత్‌లో అత్యంత అమానవనీయ, తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే సంఘటన జరిగింది. క్షుద్ర పూజల్లో భాగంగా దంపతులు తమకు తామే తలలు నరుక్కుని నరబలి ఇచ్చుకున్నారు. క్షుద్రపూజల్లో భాగంగానే దంపతులు ఈ విధంగా చేశారని పోలీసులు భావిస్తున్నారు. రాజ్‌కోట్ జిల్లా వింఛియా గ్రామంలో ఈ ఘటన జరిగింది. హేముభాయ్ మక్వానా (38), ఆయన భార్య హన్సాబెన్ (35) తమ పొలంలో ఉన్న గుడిసెలో శనివారం ఈ దారుణ చర్యకు పాల్పడ్డారు. పదునైన బ్లేడ్ వంటి పరికరంతో తమ తలలు తెగిపడిన తరువాత అవి హోమగుండంలోకి దొర్లే విధంగా ఏర్పాటు చేసుకున్నారని స్థానిక పోలీసు అధికారి ఇంద్రజిత్ సిన్హా జడేజా తెలిపారు. ఈ దంపతులు తమ పిల్లల్నిద్దర్నీ బంధువులు ఇళ్లకు పంపారు.

తమ తల్లిదండ్రులు, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూసైడ్ నోట్‌లో దంపతులు బంధువులను కోరారు. ఈ లేఖను సంఘటనా స్థలం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడాది కాలంగా దంపతులిద్దరూ గుడిసెలో పూజలు, ప్రార్థనలు చేస్తున్నారని బంధువులు, స్థానికులు చెప్పారు.

డివల్యూషన్ నిధుల్లో కేంద్రం కత్తిరింపులు

- చిక్కిపోతున్న రాష్ట్ర వాటా నిధులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర, రాష్ట్ర పథకాలకు అందించాల్సిన సాయంలో ఏడాపెడా కోతలు విధిస్తున్న కేంద్ర ప్రభుత్వం కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధుల్లోనూ భారీగా కోతలు పెడుతోంది. నిర్దేశించిన కేటాయింపుల కన్నా విడుదల భారీగా తగ్గిపోతోంది. గత రెండు ఆర్థిక సంఘాల సిఫార్సులు, ఆయా సంవత్సరాల్లో రాష్ట్రాలకు ఇచ్చిన నిధుల వివరాలు అధ్యయనం చేస్తే కోతల పర్వం సుస్పష్టంగా కనిపిస్తుంది. పథకాలను రద్దు చేసినా వాటా నిధులను పెంచడం ద్వారా రాష్ట్రాలకు మేలు చేస్తున్నట్లు చెబుతున్న కేంద్రం.. వాటా నిధుల్లోనూ కోతలు పెడుతుండడంతో రాష్ట్రాలు ఆర్థికంగా అల్లాడిపోతున్నాయి. తాజాగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై వచ్చిన నివేదిక పరిశీలిస్తే భారీగానే కోతలు పడినట్లు తేలింది. 13వ ఆర్థిక సంఘం నుంచి ప్రస్తుత 15వ ఆర్థిక సంఘం వరకు వాస్తవ సిఫార్సులు, కేటాయింపుల మధ్య తేడా ఎక్కువగా ఉన్నట్లు తేలింది. 13వ ఆర్థిక సంఘం 32 శాతంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా ఖరారు చేయగా, ఆ ఐదేళ్లలో ఒక్క సంవత్సరం కూడా 29 శాతం దాటలేదు. అలాగే 14వ ఆర్థిక సంఘం ఐదేళ్లకు 42 శాతంగా వాటా నిధులను సిఫార్సు చేయగా, అత్యధికంగా 2018-19లో 37 శాతం విడుదల చేశారు. ఇక 2020-21 నుంచి ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంఘంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఐదేళ్ల కాలానికి 41 శాతం వాటా నిధులను సిఫార్సు చేయగా, గరిష్టంగా 30 శాతం మాత్రమే విడుదలయ్యాయి.

వాస్తవ సిఫార్సులు, విడుదల వివరాలు (శాతంలో)

సంవత్సరం	సిఫార్సు	విడుదల
14వ ఆర్థిక సంఘం పరిధిలో		
2015-16	42	35
2016-17	42	35
2017-18	42	35
2018-19	42	37
2019-20	42	32
15వ ఆర్థిక సంఘం పరిధిలో		
2020-21	41	29
2021-22	41	30
2022-23	41	30

రాష్ట్రాల ఆశలు గల్లంతు

వాస్తవానికి 14వ ఆర్థిక సంఘం నుంచి వాటా నిధులను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచారు. దీనివల్ల రాష్ట్రాల్లో అమలు చేసే అనేక పథకాలను కూడా కేంద్రం ఎత్తివేసింది. కాని, ఆ వాటా నిధుల్లో కూడా కోతలు విధించడంతో రాష్ట్రాలు ఆర్థికంగా, తీవ్రంగా నష్టపోతున్నాయి. అటు పథకాలకు నిధులు రాక, ఇటు వాటా నిధులు సక్రమంగా అందకపోవడంతో రాష్ట్రాల ఖజానాపై పెను భారం పడుతోంది.

దళితులపై పెత్తందార్ల దాడి

- ఐదుగురు దళితులతో పాటు సిఐ, హోంగార్డుకు గాయాలు
- 144 సెక్షన్ అమలు

గాయాలపాలైన దళితులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

దళితులపై పెత్తందారులు దాడికి పాల్పడ్డారు. ఆర్చ్ నిర్మాణం విషయంలో వివాదం తలెత్తడంతో ఐదుగురు దళితులతోపాటు సిఐ, హోంగార్డుకు గాయాలయ్యాయి. ఈ సంఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇజ్రాయేలుపేట దళితులు వారి దళితవాడకు వెళ్లే ప్రధాన రహదారి ముందు ఆర్చ్ నిర్మించుకునేందుకు పిల్లర్లు వేసే పని ప్రారంభించారు. దీన్ని గ్రామంలోని కొందరు పెత్తందారులు సహించలేకపోయారు. పనులను అడ్డుకుని పోలీసుల ఎదుటే దళితులపై దాడికి దిగారు. పిల్లర్ బాక్సులను తొలగించారు. దళితులపై రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో సిఐ మారుతీకృష్ణ, హోంగార్డు హిదయతుల్లాతోపాటు ఐదుగురు దళితులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తుగా గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఇజ్రాయేలుపేట ఆర్చ్ నిర్మాణ స్థలం పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

సంయమనం పాటించండి : మంత్రి సురేష్

దళితులకు, పెత్తందారులకు మధ్య వివాదం తలెత్తిన నేపథ్యంలో రెండు గ్రూపులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, మార్కాపురం డిఎస్‌పి కిశోర్ కుమార్, ఇతర అధికారుల సమక్షంలో చర్చలు జరిపారు. సంయమనం పాటించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇరువూరు రాజీకి రావాలని కోరారు.

నేడు 117 మండలాల్లో వడగాలులు

- ఎండ తీవ్రత నుంచి రక్షణ చర్యలు
- విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఐఎండి అంచనాల ప్రకారం ఈ నెల 18న 117 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలందరూ ఎండ తీవ్రత సమయంలో ఇళ్లల్లోంచి బయటకు రావొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. మంగళవారం తీవ్ర వడగాలులు మన్యం జిల్లా కొమరాడలో ఉంటాయని, అల్లూరి జిల్లా 7 మండలాల్లో, అనకాపల్లి 16, తూర్పుగోదావరి 4, ఏలూరు 2, గుంటూరు 6, కాకినాడ 10, కృష్ణా 4, నంద్యాల 2, ఎన్‌టిఆర్ 13, పల్నాడు 2, పార్వతీపురం మన్యం 12, శ్రీకాకుళం 5, విశాఖపట్నం 2, విజయనగరం 19, వైఎస్ఆర్ జిల్లాలో 13 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని తెలిపారు. సోమవారం అనకాపల్లిలో 5, కాకినాడలో 3, పల్నాడులో 2, ఏలూరు, కృష్ణా, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లోని ఒక్కొక్క మండలంలో తీవ్ర వడగాలులు, 116 మండలాల్లో వడగాలులు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

అరకొర పరిహారం

పోర్టు శంకుస్థాపనకు నిర్మిస్తున్న పైలాన్

- ఇంకా 63 శాతం కుటుంబాలకు అందని సొమ్ము
- రేపు మూలపేట పోర్టుకు సిఎం భూమిపూజ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మూలపేట (భావనపాడు) పోర్టు నిర్వాసితులకు ప్రభుత్వం పునరావాసం, పరిహారం చెల్లింపులు పూర్తి స్థాయిలో చేయకుండానే శంకుస్థాపనకు సిద్ధమవుతోంది. పిడిఎఫ్ (ప్రాజెక్టు డిస్‌ప్లేస్డ్ ఫ్యామిలీస్) కుటుంబాల్లో 63 శాతం కుటుంబాలకు నేటికీ డబ్బులు ఇవ్వలేదు. జిరాయితీ భూములకు అరకొరగానే చెల్లించింది. పరిహారం డబ్బులు తీసుకునేందుకు 40 మందికిపైగా రైతులు తిరస్కరించారు. ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. భూసేకరణ, పర్యావరణ మదింపు తదితర సందర్భాల్లో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడం లేదు. నోరెత్తితే కేసులు పెడుతుందనే భయంతో కొందరు ఉన్నారు. డబ్బులు తీసుకోకపోతే తర్వాత ఇస్తారో లేదోనన్న భయంతో మరికొందరు ప్రభుత్వం ఇచ్చిన అరకొర పరిహారంతో సరిపెట్టుకుంటున్నారు. మూలపేట పోర్టు కోసం ప్రభుత్వం 531.69 ఎకరాలను సేకరించింది. అందులో ప్రభుత్వ భూమి 211.38 ఎకరాలు, జిరాయతీ భూములు 320.31 ఎకరాలు ఉన్నాయి. పోర్టు శంకుస్థాపనకు ఈ నెల 19న జిల్లాకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11 నుంచి జిరాయతీ భూములకు అధికారులు హడావుడిగా చెల్లింపులు మొదలుపెట్టారు. ఎకరాకు రూ.25 లక్షలు చొప్పున ఇప్పటివరకు 280 ఎకరాలకు చెల్లించారు. మిగిలిన 40 ఎకరాలకు సంబంధించిన 43 మంది రైతులు పరిహారం తిరస్కరించారు. తమకు పోర్టు అవసరం లేదంటూ తమ భూమి పత్రాలు నేటికీ ఇవ్వలేదు. పోర్టు నిర్మాణంతో 594 కుటుంబాల వారు నిర్వాసితులవుతారని అధికారులు గుర్తించారు. పిడిఎఫ్ కుటుంబానికి ఇంటి స్థలంతో కలిపి రూ.9.91 లక్షలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కుటుంబంలో చేతివృత్తిదారులు ఉంటే వన్ టైమ్ గ్రాంట్ కింద రూ.25 వేలు, పశువులశాలకు రూ.25 వేలు పరిహారంగా ఇస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ఇటువంటి వారికి రూ.10.41 లక్షలు చెల్లించనున్నట్లు హామీ ఇచ్చింది. ఇప్పటివరకు సుమారు 200 కుటుంబాలకు మాత్రమే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. శంకుస్థాపనకు ఇంకా ఒక్కరోజు మాత్రమే ఉండడంతో ఈలోగా కొందరికి డబ్బులు అందకపోవచ్చని అధికారులే చెప్తున్నారు. ఇళ్లు, పశువులశాలలు, ఇతర నిర్మాణాలు కలిపి మొత్తం 420 ఉన్నట్లు గుర్తించారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీకి సిద్ధం కాని భూమి

పోర్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న మూలపేట, విష్ణుచక్రం నిర్వాసిత కుటుంబాలకు కస్పానౌపడలో స్థలాలు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. మొత్తం 594 కుటుంబాలకు 55 ఎకరాలు అవసరమని గుర్తించారు. ఇప్పటివరకూ 30.98 ఎకరాలకు అవార్డు పాస్ చేశారు. ఇంకా 24.02 ఎకరాలకు అవార్డు పాస్ చేయాల్సి ఉంది. పరిహారం తక్కువగా ఉండడంతో ఇందులో పది ఎకరాలకు సంబంధించిన

మిగతా 2లో

సమస్యలు పరిష్కరించాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, నాయకులు సుప్రజ, లక్ష్మీదేవి, నిర్మల, వెంకటలక్ష్మి తదితరులు ఐసిడిఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్రకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ యూనియన్ నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. మినీ వర్కర్లకు వేసవిలో సెలవులు ఇవ్వాలని, కమలాపురం ప్రాజెక్టులో హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలపై రాజకీయ జోక్యం అరికట్టాలని కోరారు. నంద్యాల జిల్లాలోని నంద్యాల రూరల్, కోయిలకుంట్ల ప్రాజెక్టులను యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అవినాష్‌ను కాపాడేందుకు జగన్ ప్రయత్నం

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివేకానందరెడ్డి హత్యకేసు నుంచి వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాస్ రెడ్డిని కాపాడేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. వైఎస్ జగన్ తాడేపల్లి రాజప్రసాదంలో లాబీయిస్ట్ విజయ్ కుమార్, ప్రముఖ కాంట్రాక్టరు కుమారుడు శశిధర్ సమావేశమయ్యారని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిని అరెస్టు కాకుండా చూసేందుకు జగన్ తలకిందులుగా తపస్సు చేసి భగీరథ ప్రయత్నాలు చేశారని తెలిపారు.

ఈ కేసులో వారిద్దరూ రిమాండ్‌కు వెళ్తారని జగన్‌కు ముందే తెలుసని చెప్పారు. సిఎం లాబీయిస్ట్ విజయకుమార్‌తో సమావేశమైంది రాష్ట్ర భవిష్యత్ కోసమా? ప్రజల ఉజ్వల భవిష్యత్ కోసమా? అని ప్రశ్నించారు. టిడిపిపై ఫేక్ వీడియోతో దుష్ప్రచారం చేసిన మన్విత్ కృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐడి అడిషనల్ డిజి విజయకుమార్‌ను వర్లతోపాటు టిడిపి బిసి విభాగం ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, హెచ్‌ఆర్‌డి సభ్యులు ఎస్‌పి సాహెబ్ కలిసి ఫిర్యాదు చేశారు.

వైద్యరంగం నిర్వీర్యం : రఫీ

వైద్యరంగాన్ని సిఎం జగన్ నిర్వీర్యం చేశారని టిడిపి అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ విమర్శించారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని పేర్కొన్నారు. 108, 104, మహాప్రస్థానం వాహనాల్ని నిర్వహించలేనప్పుడు ప్రజల్ని ఫ్యామిలీ డాక్టర్‌తో ఆదుకుంటారా? అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.750 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో వైద్యసేవల్ని ఆస్పత్రులు నిలిపివేశాయని తెలిపారు. ఉద్యోగుల వైద్యానికి సంబంధించి ప్రభుత్వం రూ.100 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

అరకొర పరిహారం

మొదటిపేజీ తరువాయి

రైతులు తమ భూమి ఇచ్చేందుకు అంగీకరించలేదు.

అటకెక్కిన హామీలు

భూ సేకరణ, ఇళ్ల కొలతలు తదితర సందర్భాల్లో స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. వారిని శాంతపరచడానికి మంచి పరిహారం చెల్లిస్తామని అధికారులు చెప్పారు. యూత్ ప్యాకేజీకి వయసు నిర్ణయించే సందర్భంలో 18 సంవత్సరాలకు నెల, రెండు నెలలు తక్కువగా ఉన్న తమ పేర్లు పిడిఎఫ్‌లో చేర్చాలని మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, స్థానిక ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌లను నిర్వాసితులు కోరారు. దీనిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామంటూ వారు హామీ ఇచ్చినా పిడిఎఫ్ జాబితాలో ఇటువంటి వారి పేర్లు లేకపోవడంతో వారంతా ఆగ్రహంతో ఉన్నారు. ప్రతి చెట్టు, మొక్కకు పరిహారం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పుడు జీడి, కొబ్బరి తోటలకు ఏకమొత్తంగా ఎకరాకు రూ.2.75 లక్షల చొప్పున చెల్లిస్తోంది. దీంతో, రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వాలని, ఆర్ అండ్ ఆర్, ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పరిహారం పెంచాలని నిర్వాసితులు కోరుతున్నారు.

అవినాష్ బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎంపి అవినాష్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ విచారణను వేగవంతం చేయడం, ఈ కేసులో అవినాష్ రెడ్డిని నిందితునిగా చేర్చడం తెలిసిందే. దీంతో, ఆయన ముందస్తు బెయిల్ కోసం సోమవారం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'వివేకా హత్యతో నాకు ఏ సంబంధమూ లేదు. దస్తగిరి వాంగ్మూలం మేరకు నన్ను ఇరికించాలని సిబిఐ చూస్తోంది. నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేసే ఉద్దేశంతో ఉంది.

ఆశ్చర్యంగా గూగుల్ టేకవుట్ డేటాను తెరపైకి తెచ్చింది. ఒక వ్యక్తి ఎక్కడున్నారో గూగుల్ టేకవుట్ డేటా చెప్పలేదు. నాలుగేళ్లలో అనేక పరిణామాల తర్వాత నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. నన్ను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్వర్వులు ఇవ్వాలి. ఒకవేళ అరెస్ట్ చేస్తే బెయిల్‌పై విడుదల చేసేలా ఆదేశించాలి' అని బెయిల్ పిటిషన్లో అవినాష్ కోరారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. దీనిపై స్పందించాల్సిందిగా సిబిఐని హైకోర్టు కోరింది. ఈ కేసులో నిందితుడుగా ఉన్న అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేస్తామని, తదుపరి చర్యలు కూడా తీసుకోవాల్సి ఉందని సిబిఐ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నెల 30 నాటికి విచారణ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు డైరెక్షన్ ఇచ్చిందని గుర్తు చేశారు. వివేకా హత్య జరిగిన తర్వాత అవినాష్ సమక్షంలోనే సాక్ష్యాలు చెరిపేశారని, ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలంపైనే ఆధారపడడం లేదని అన్నారు. సిఆర్‌పిసి 160 నోటీసులు ఇచ్చినా ఆధారాలను బట్టి అరెస్ట్ చేయవచ్చని సిబిఐ న్యాయవాది వివరించారు.

నేటి సాయంత్రం 4 గంటలకు అవినాష్ రెడ్డిని విచారించనున్న సిబిఐ

సిబిఐ ఇచ్చిన నోటీసుల మేరకు తన క్లయింట్ అవినాష్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని సిబిఐ కార్యాలయానికి చేరుకునే సమయానికి మంగళవారం ఉదయం 10.30 గంటలకు రావాల్సిందిగా సిబిఐ అదనపు ఎస్‌పి ముఖేష్ శర్మ సమాచారమిచ్చారని అవినాష్ రెడ్డి తరుపున సీనియర్ అడ్వకేట్ నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వివేకా హత్యకు నాలుగు కారణాలున్నాయన్నారు. వీటిలో ఒకటి కుటుంబం, రెండోది వ్యాపార సంబంధాలు, మూడోది వివాహేతర సంబంధం, నాలుగోది పొలిటికల్ గెయిన్ అని తెలిపారు. ఈ కేసుతో తన క్లయింట్‌కు ఎటువంటి సంబంధమూ లేదని, ఆయనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ అవినాష్ రెడ్డిని మంగళవారం సాయంత్రం విచారణకు పిలవాలని సిబిఐకి సూచించారు. దీనికి అంగీకరించిన సిబిఐ... సాయంత్రం నాలుగు గంటలకు విచారిస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. కాగా, తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఎంపి అవినాష్ రెడ్డి వేసిన పిటిషన్‌లో తన వాదనలు కూడా వినాలని కోరుతూ వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె సునీత సోమవారం హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.

రాజధాని గ్రామాల్లో నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- అసెంబ్లీ, సచివాలయ పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

పెండింగ్ పిఎఫ్ వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ, సచివాలయ పారిశుధ్య కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. అసెంబ్లీ, సచివాలయ పారిశుధ్య కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత రాజధానిలోని మల్కాపురం పాత అన్న క్యాంటిన్ నుండి మందడం సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ అసెంబ్లీ, సచివాలయ పారిశుధ్య కార్మికులకు ఏడు నెలలుగా చెల్లించాల్సిన పెండింగ్ పిఎఫ్ వెంటనే చెల్లించాలని, ఇఎస్ఐ కార్డులు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.21 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా జీతాలివ్వకుంటే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. గత ఎనిమిదేళ్లుగా అసెంబ్లీ, సచివాలయంలో పనిచేస్తున్నప్పటికీ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, కాంట్రాక్టర్ మారినప్పుడల్లా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను సిఆర్‌డిఎ అధికారులు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గ్రేస్, బుజ్జి, నాగరాజు, చిట్టిబాబు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నేత మల్ల సత్యనారాయణ కన్నుమూత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మల్ల సత్యనారాయణ (ఫైల్)

సిపిఎం సీనియర్ నాయకులు మల్ల సత్యనారాయణ (64) సోమవారం సాయంత్రం అనకాపల్లిలోని తన స్వగృహంలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన కేన్సర్‌తో బాధపడుతున్నారు. అనకాపల్లి పట్టణంలో పలు కార్మిక సంఘాలు ఏర్పాటు చేయడంలోనూ, పోరాటాలు నిర్వహించడంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. సిఐటియు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఉపాధ్యక్షులుగా, అనకాపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. బెల్లం మార్కెట్‌లో గుమస్తాగా చేరి గుమస్తాల సంఘం నాయకునిగా ఎదిగారు. కొలగార్ల సంఘం, కళాసీల సంఘాల సభ్యులతో కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటుచేసి కార్మికుల పిల్లలకు విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించారు. గౌరీ గ్రంథాలయ చైర్మన్‌గా, ఎఎంఎఎల్ కళాశాల కరస్పాండెంట్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. అనకాపల్లి మున్సిపల్ కౌన్సిలర్‌గా రెండుసార్లు ఎన్నికయ్యారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యుడిగా, అనకాపల్లి సిపిఎం డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు భార్య సరోజిని, కుమారులు మల్ల జగదీష్, సుందరవాసు ఉన్నారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

బివి.రాఘవులు, వి.శ్రీనివాసరావు సహా పలువురు సంతాపం

ఆయన మృతిపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. సత్యనారాయణ మృతిపై సిఐటియు రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. అనకాపల్లి ప్రాంతంలో సిఐటియు ఉద్యమం నిర్మించడంలో సత్యనారాయణ కీలకపాత్ర వహించారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు గుర్తు చేశారు.

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా

పిఎసిఎస్ ఉద్యోగుల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రాథమిక వ్యవసాయ రుణ పరపతి సంఘాల (పిఎసిఎస్) ప్రయివేటీకరణ ఆపాలని, రైతుభరోసా కేంద్రాలను పిఎసిఎస్‌లో విలీనం చేయరాదని డిమాండ్ చేస్తూ పిఎసిఎస్ ఉద్యోగులు రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం ఆందోళనలు చేశారు. ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల్లో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నాలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.బి రంగనాథం మాట్లాడుతూ సహకార శాఖ పరిధిలో ఉన్న పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందించారు. పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఉద్యోగులు ధర్నాలు చేశారు. అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. పిఎసిఎస్‌లలో 50 శాతం వాటాను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ, రైతు భరోసా కేంద్రాలను పిఎసిఎస్‌ల్లో విలీనం చేస్తూ 1964 సహకార చట్టానికి చేసిన సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ సహకార సంఘాలను ప్రయివేటీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్ట సవరణను వెంటనే రద్దు చేసి, సహకార సంస్థలను బలోపేతం చేయడంతోపాటు ఉద్యోగుల భద్రతను కాపాడాలన్నారు. సహకార సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపహరించుకోవాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేశారు. ఎండను సైతం లెక్క చేయకుండా కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. సొసైటీ ఉద్యోగులకూ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

ఎంపి గల్లా జయదేవ్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

టిడిపి ఎంపి గల్లా జయదేవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. తన ఎన్నికను సవాల్ చేస్తూ వైసిపి అభ్యర్థి మోదుగల వేణుగోపాల్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేయాలంటూ గల్లా జయదేవ్ తొలుత ఎపి హైకోర్టును ఆశ్రయించారు. మెరిట్స్‌పై విచారణ చేస్తామంటూ ఎపి హైకోర్టు గల్లా జయదేవ్ పిటిషన్ కొట్టివేసింది. దీంతో జయదేవ్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జెకె మహేశ్వరితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టులో విచారణ ఎదుర్కోవాలని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టేసింది.

మార్గదర్శి ఆడిటర్ బెయిల్ కేసులో తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

నిందితుడిని రిమాండ్ చేశాక బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలే గానీ, రిమాండ్‌ను తప్పుపడుతూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని మార్గదర్శి ఆడిటర్ కేసులో సిఐడి వాదించింది. మార్గదర్శి చిట్‌ఫండ్ నిధుల మళ్లింపు వ్యవహారంలో ఆడిటర్ శ్రవణ్‌కుమార్‌ను సిఐడి అరెస్టు చేసింది. తన భర్త రిమాండ్ అయ్యారని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన భార్య నర్మద దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనల తర్వాత తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు జస్టిస్ డివిఎస్-ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రకటించింది.

ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించాలి

- పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డికి, ఎపి కౌలు రైతుల సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రబీ సీజన్ నూర్పిడి పనులు వేగంగా జరుగుతున్నాయని, కౌలు రైతులకు తోడ్పాటు అందించేందుకు అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండియన్‌ను ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం కార్యదర్శి ఎం హరిబాబు సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఖరీఫ్‌లో మిగిలిన ధాన్యాన్ని, రబీలో పండించిన ధాన్యాన్ని పరిమితి లేకుండా కొనుగోలు చేయాలని కోరారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

- క్షేత్రస్థాయి పర్యటనలకు మంత్రి, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మాణాలు అనుకున్నంత స్థాయిలో వేగంగా జరగడం లేదు. 5 లక్షల గృహాలకు ఒకేరోజు గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం భావించినప్పటికీ ఆచరణలో ఆ స్థాయిలో గృహాలు పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, ఆశాఖ మేనేజింగ్ డైరెక్టరు లక్ష్మీశా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టడం ద్వారా అధికారులు, లబ్ధిదారుల్లో ఉత్సాహాన్ని నింపవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 18న మంగళవారం తొలుత ఏలూరు పర్యటనకు వెళ్లనున్నారు. కలెక్టరేట్‌లో సమీక్షతో పాటు స్థానికంగా ఉన్న జగనన్న కాలనీల్లోని పనులను స్వయంగా పర్యవేక్షించనున్నారు. కలెక్టరేట్‌లో గృహ నిర్మాణాలతోపాటు రెవెన్యూ, డ్వామా, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, పిహెచ్ అండ్ డిస్కమ్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం బీమడోలు లే అవుట్‌ను సందర్శించనున్నారు. 19న గుంటూరు జిల్లా పర్యటనకు మంత్రులు, అధికారులు వెళ్లనున్నారు. కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష అనంతరం పేరేచెర్ల లే అవుట్, నరసరావుపేట ఉప్పలపాడు లే అవుట్ తనిఖీలు నిర్వహించనున్నారు. ఇదే తరహాలో వారానికి రెండు జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని లక్ష్మీశా, ఉన్నతాధికారులు రూట్‌మ్యాప్‌ను ఖరారు చేశారు.

సాక్షి సర్క్యులేషన్‌పై కేసు ఢిల్లీ హైకోర్టుకు బదిలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో వాలంటీర్లంతా సాక్షి పేపర్ కొనుగోలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జిఓలను విడుదల చేసిందని పేర్కొంటూ ఉషోదయ పబ్లికేషన్స్ ఆధ్వర్యాన ఈనాడు దాఖలు చేసిన కేసు విచారణను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. వాలంటీర్లకు నెలనెలా రూ.200 మంజూరు చేసి, సాక్షి పత్రిక కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రెండు జిఓలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఉషోదయ పబ్లికేషన్స్ సవాల్ చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్టే విధించింది. దీంతో సుప్రీం కోర్టులో ఉషోదయ పబ్లికేషన్స్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌పై విచారణ జరపాలని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు కోరింది. న్యాయ, పరిపాలన ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విచారణను ఎపి హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు సిజెఐ డివై చంద్రచూడ్ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి కోసం ప్రార్థించండి

- ఇఫ్తార్‌లో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ ప్రార్థించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. విజయవాడలోని విద్యాధరపురంలో రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఎం ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరి ప్రార్థనలు సఫలం కావాలని ఆకాంక్షించారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముస్లిం మైనార్టీలకు ఎక్కువ నిధులు కేటాయించిన రాష్ట్రం మనదేనని తెలిపారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ నిధులు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్‌డి రుహల్లా, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వైటి.దాస్

'ఉక్కు' అధికారుల బంగ్లాలను ముట్టడిస్తాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ త్వరలో ఉక్కు సిఎమ్‌డి, ఇతర అధికారుల బంగ్లాలను ముట్టడిస్తామని, ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 795వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ 1 విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వైటి.దాస్, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్‌లో బిడ్డింగ్ వేసిన సంస్థలు ప్రభుత్వ రంగానివై ఉండాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ శనివారం సింహాచలం వరకూ నిర్వహించిన ఉక్కు సంకల్ప పాదయాత్రకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.

గుంటూరు జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

- సిఐడి చర్యకు నిరసన

ప్రజాశక్తి -యంత్రాంగం

న్యాయవాదులకు సిఐడి అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు విధులను బహిష్కరించారు. విజయవాడలోని ఎపి ప్రొఫెషనల్ ఫోరం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐడి తీరును తప్పుపట్టిన న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, గొట్టిపాటి రామకృష్ణ, హైకోర్టు న్యాయవాది జాడ శ్రావణ్ కుమార్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, ఏలూరు, పశ్చిమగోదావరిలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. నేర శిక్షా స్మృతి సెక్షన్ 160 కింద న్యాయవాదులకు నోటీసులు జారీ చేయడం వాక్ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగించడమేనని పలువురు న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. గుంటూరులోని జిల్లా కోర్టు ప్రధాన ద్వారం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కృష్ణా జిల్లా మైలవరం, నందిగామలో ఆందోళనకు దిగారు. శ్రీకాకుళం జిల్లా కోర్టు ఆవరణలో నిరసన చేపట్టారు. న్యాయవాదులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, భౌతిక దాడులకు దిగడం తగదన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులివ్వండి

- కేంద్ర మంత్రి, కార్యదర్శిలకు సర్పంచ్‌ల వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని సర్పంచులకు గత రెండేళ్లుగా, రెండు విడతలుగా రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విజ్ఞాన్ భవన్లో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి సునీల్ కుమార్‌ను సంఘం నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన్లో సర్పంచుల సంఘం నేతలు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క అవార్డు కూడా రాలేదని, అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే కారణమని విమర్శించారు. స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవటమే ముఖ్యమైన కారణమన్నారు. ఇప్పటికైనా జగన్ పునరాలోచన చేయాలని, రాష్ట్రానికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను నేరుగా కోతల లేకుండా గ్రామ పంచాయతీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి 2022-23, 2023-24లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,010 కోట్లు రావాల్సి ఉందని, తక్షణమే విడుదల చేయాలని కేంద్ర మంత్రి, కార్యదర్శిని కోరామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిఎఫ్ఎంఎస్‌లోకి నిధులను వేయటం లేదని, కేంద్రంతో పిఎఫ్ఎంఎస్‌ని గ్రామ పంచాయతీలకు లింక్ చేయటం లేదని కేంద్ర మంత్రి తెలిపినట్లు పేర్కొన్నారు. కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లు విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ రీజనల్ పవర్ కమిటీ చైర్మన్‌గా విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌ను సౌత్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్‌ఆర్‌పిసి) చైర్మన్‌గా కేంద్ర ఎలక్ట్రిసిటీ ఆథారిటీ (సిఇఎ) నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సిఇఎ కార్యదర్శి సభ్యులు అసిత్ సింగ్ ఇటీవల విడుదల చేశారు. ఎస్‌ఆర్‌పిసిలో రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ఉన్నాయి. ఇది అంతర్రాష్ట్ర విద్యుత్ పంపిణీ, రీజనల్ పవర్ గ్రిడ్ ఆపరేషన్, వినియోగం, విద్యుత్ బిల్లు చెల్లింపులను ఎస్‌ఆర్‌పిసి పర్యవేక్షిస్తుంది. రాష్ట్రాల మధ్య విద్యుత్ అవసరాలు, అంతర్రాష్ట్ర విద్యుత్ వివాదాలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతుంది. ఈ నియామకం పట్ల కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రికి, సిఇఎకి విజయానంద్ ధన్యవాదాలు తెలిపారు.

కోడికత్తి కేసు విచారణ 20కి వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆనాటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై 2019లో విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన కోడికత్తి ఘటనకు సంబంధించిన కేసు విచారణ ఎన్‌ఐఎ కోర్టు ఈ నెల 20కు వాయిదా వేసింది. ప్రస్తుతం ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) విచారిస్తుండగా, లోతైన దర్యాప్తు అవసరమని సిఎం జగన్ విజయవాడ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పిటిషనరు (సిఎం) తరపున న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. ఎన్‌ఐఎ దర్యాప్తు బృందం తరపున న్యాయవాది తమ వాదనలు వినిపించడానికి కొంత సమయం కావాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో కేసును ఈ నెల 20కు వాయిదా వేశారు.

నేటి నుంచి చంద్రబాబు జిల్లాల పర్యటన

- అదనపు భద్రత కల్పించాలని డిజిపికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కడప, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో మంగళవారం నుంచి పర్యటించనున్నారు. ఈ నెల 18న కడపలో, 19న ప్రకాశం, 20న మార్కాపురం, 21న ఎర్రగొండపాలెంలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనలకు అదనపు భద్రతా ఏర్పాట్లు కల్పించాలని డిజిపికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు లేఖ రాశారు. ఈ నెల 20న చంద్రబాబు పుట్టినరోజు కావడంతో మార్కాపురంలో పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులు, అసాంఘిక శక్తులు సమావేశాలపై టార్గెట్ చేసే ప్రమాదం ఉందని తెలిపారు. కావున అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు.

మారుతీ సుజుకి నుంచి కొత్త మినీ ట్రక్కు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి కొత్తగా తేలికపాటి వాణిజ్య వాహనం విభాగంలో సూపర్ క్యారీని విడుదల చేసింది. ఈ పెట్రోల్ ఇంజిన్ మినీ ట్రక్కు ప్రారంభ ధరను రూ.5.15 లక్షలుగా నిర్ణయించింది. సిఎన్‌జి వేరియంట్ ధరను రూ.6.15 లక్షలుగా పేర్కొంది. 1.2 లీటర్ ఇంజిన్‌లో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌ను అందిస్తుంది. ఈ మినీ ట్రక్కు ఆ సంస్థ 370 అవుట్‌లెట్‌లలో లభిస్తుందని తెలిపింది.

ఉక్కు ప్రయివేటీకరణకు కుట్ర

- 'బిజెపి రెండు నాల్కల ధోరణి'పై సిహెచ్ నర్సింగరావు ధ్వజం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేట్‌వారికి ధారాదత్తం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. విశాఖ ఉక్కుపై బిజెపి రెండు నాల్కల ధోరణిని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తిరుపతి జీవకోన వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్ చేతగానితనం వల్లే ఆంధ్రప్రదేశ్‌ను ఆదానీప్రదేశ్‌గా మోడీ మార్చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రానికి తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంలో వైసిపి ప్రభుత్వం వెనుకంజ వేస్తోందని మండిపడ్డారు. ఉక్కుపై రాష్ట్ర ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకోవాలని, ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు కోసం రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజామద్దతుతో ఉక్కును కాపాడుకుంటామని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వమూ బిడ్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నాయకులు ఆర్.లక్ష్మి, టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, మునిరాజా, జయచంద్ర పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి

- యువగళం పాదయాత్రలో లోకేష్

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం బుర్రికుంటలో ముఖాముఖి కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి- దేవనకొండ (కర్నూలు)

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీనిచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలం ఎన్‌కె కొట్టాల క్యాంప్ నుంచి ప్రారంభమైంది. గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బుర్రకుంట, వెంకటాపురం గ్రామాల మీదుగా యాత్ర సాగింది. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా పి.కోటకొండ వరకు పిల్ల కాలువల నిర్మాణాలను చేపట్టి సాగు నీరు ఇవ్వాలని గుడిమిరాళ్ల గ్రామస్తులు లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. సబ్సిడీ ద్వారా గొర్రెల పెంపకందారులకు గొర్రెల యూనిట్లు, మందులు పంపిణీ చేయాలని మరికొందరు విజ్ఞప్తి చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. బుర్రకుంట గ్రామ సమీపంలో ఆలూరు నియోజకవర్గం పరిధిలోని రైతులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ మండలాల రైతులు రైతాంగ సమస్యలను విన్నవించారు. ఆస్పరి, దేవనకొండ ప్రాంతాల రైతులు అధిక విస్తీర్ణంలో టమోటా పంటను సాగు చేస్తారని జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయా మండలాల రైతులు విన్నవించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీలకు చెల్లిస్తున్న వేతనాల్లో కోత విధించారని, హంద్రీనీవా కాలువలు అసంపూర్తిగా ఉన్నాయని తక్షణమే వాటిని పూర్తి చేయించాలని మరికొంత మంది రైతులు విన్నవించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే వేదవతి, నగరడోనా, హంద్రీనీవా, ఎల్‌ఎల్‌సి, ఆర్‌డిఎస్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులను ఆదుకుంటామని భరోసానిచ్చారు. కర్నూలు జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పెట్టుబడులను తీసుకువస్తామన్నారు. వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ చట్టాన్ని అనుసంధానం చేసి పండ్ల తోటల పెంపకం అభివృద్ధికి కృషి చేస్తామని హామీనిచ్చారు. మిగులు గోదావరి జలాలను రాయలసీమకు తరలిస్తామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మిస్తామని, పాటు ప్రతి ఇంటికీ మంచినీటిని అందించే బాధ్యత టిడిపి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్లసూర్య ప్రకాష్‌రెడ్డి, ఆయా మండలాల ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిర్వీర్యానికి బిజెపి కుట్ర

- పాసింజర్ రైళ్లను పున:ప్రారంభించాలి
- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి హామీ చట్టం అమలుకు బిజెపి మొదటి నుండి వ్యతిరేకంగా ఉందని, ఏదో విధంగా పేదలకు ఉన్న ఉపాధిని కనుమరుగు చేయాలని కుతంత్రాలు చేస్తుందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. సోమవారం ఆంధ్రా, తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతోపాటు కూలీలకు ఉపయోగం లేని టెక్నాలజీతో ఆన్‌లైన్ మస్టర్ వేయాలని, ఆండ్రాయిడ్ ఫోన్లు వాడాలని అడ్డగోలు పద్ధతులను తెచ్చిందని చెప్పారు. గతేడాది చేసిన పనులకు ఇప్పటికీ అనేక రాష్ట్రాల్లో బిల్లులు విడుదల చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసమే ఇటీవల అంబేద్కర్ జయంతి సభలు బిజెపి ఆర్భాటంగా నిర్వహించిందన్నారు. భారత చరిత్రను బిజెపి వక్రీకరిస్తున్నదని, చారిత్రక వాస్తవాలు అన్నీ రూపుమాపాలని ప్రయత్నిస్తుందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలపై కక్ష కట్టిందని, ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి నిధులివ్వడం లేదని అన్నారు. ఏడాదికిపైగా కార్మికులు, ప్రజలు వైజాగ్ స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు పోరాడుతున్నా సిఎం జగన్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. కేసులకు భయపడి జగన్ ఎపిని కార్పొరేట్‌పరం చేస్తున్నారని, పోలవరానికి నిధులు ఇవ్వకపోతే మాట్లాడటం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను, అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే విధానాలను ప్రతిఘటిస్తూ ఆరు నెలలపాటు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. దళితుల సమస్యలపై దశలవారీ ఆందోళన చేపడతామన్నారు. కోట్లాదిమంది పేదలకు అవసరమైన పాసింజర్ రైళ్లు తీసేసి, ధనవంతుల అవసరాలకు అనుగుణంగా వందే భారత్ రైళ్లను తీసుకొస్తున్నారని విమర్శించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొత్త కొత్త పేర్లు పెట్టి రూ.1,000 ఉన్న టికెట్ ధరను రూ.3,000లకు పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. కోవిడ్ కాలంలో ఆపిన పాసింజర్ రైళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తిరుపతి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే 16 పాసింజర్ రైళ్లను రద్దు చేశారని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు తగ్గించి, ఎసి బోగీలు పెంచారని విమర్శించారు. రోజూ డీజిల్ రేట్లు, తరచూ టోల్ ఛార్జీలు పెరగటంతో ఆర్‌టిసి బస్సుల ఛార్జీలు పేదలకు అందని స్థాయికి పోతున్నాయన్నారు.

25 వరకు ఎయు ఇంజినీరింగ్ ఎంట్రన్స్ దరఖాస్తు గడువు

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే ఆఈట్ - 2023 దరఖాస్తు గడువు ఈ నెల 25తో ముగియనుందని ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఎయు సెనేట్ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆఈట్-2023 నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేశామని, ఇంటర్ విద్యార్హత కలిగిన, ఇంటర్ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రూ.750 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మే 3న విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడపల్లో ఏర్పాటు చేసిన 30 కేంద్రాలలో పరీక్ష నిర్వహించి, మే 5న ఫలితాలు విడుదల చేస్తామన్నారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు నాలుగు సంవత్సరాల అనంతరం బిటెక్ డిగ్రీతో వెళ్లే అవకాశం ఉందన్నారు. విద్యార్థి కోరితే ఎంటెక్ కోర్సును సైతం పూర్తిచేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఆఈట్ 2023 ద్వారా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో 360, ఇసిఇలో 60, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో 30 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నామని తెలిపారు.

ఐఎఎస్‌లకు అదనపు బాధ్యతలు

- జిఓఆర్‌టి నెంబరు 716 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇద్దరు ఐఎఎస్ అధికారులకు అదనపు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం జిఓఆర్‌టి నెంబరు 716ని విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఐఎఎస్ 2000 బ్యాచ్‌కు చెందిన ఎస్ సురేష్‌కుమార్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఐటిఇ అండ్ సి డిపార్టుమెంట్ సెక్రటరీ టు గవర్నమెంటుగా విధులు నిర్వహిస్తున్న 2002 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన కోన శశిధర్‌కు రియల్ టైమ్ గవర్నెన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉపాధి హామీలో కార్మిక వ్యతిరేక మార్పులను రద్దు చేయాలి : ఎఐఎఆర్‌ఎల్‌ఎ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొస్తోందని అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం (ఎఐఎఆర్‌ఎల్‌ఎ) పేర్కొంది. విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం ఉపాధి హామీ పథకంలో కేంద్రం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక మార్పులను రద్దు చేయాలంటూ చేపట్టిన ధర్నానుద్దేశించి లిబెక్టక్ ఇండియా పరిశోధకుడు బుద్ధ చక్రధర్ మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఎలాంటి అభ్యంతరం లేకుండా 2021 నవంబరు, డిసెంబరు నుంచి వాటిని అమలు చేయడం మొదలుపెట్టాయన్నారు. ఈ మార్పులు ఏవిధంగా చూసినా హేతుబద్ధంగా లేవన్నారు. జియో ట్యాగింగ్‌తో ఒక పనిదినంలో రెండుసార్లు ఫొటోలు తీయాలనే నియమం పెట్టారన్నారు. కొత్త మార్పులు కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రామీణ కార్మికులు పనిదినాలు, వేతనాలు నష్టపోతున్నారన్నారు. అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం ఎపి విభాగం రాష్ట్ర అధ్యక్షులు బుగత బంగార్రావు మాట్లాడుతూ.. 2021 డిసెంబరు ముందు నాటి స్థితిని పునరుద్ధరించాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు, కార్మికులు పనిలోకి రాకుండా చేయడానికి ఉద్దేశించినవన్నారు. ధర్నా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, ఎస్ వెంకటేశ్వర్లు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి జి రోహిత్ మద్దతు ప్రకటించారు. అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎగుపాటి అర్జునరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు ఎంపి రామ్‌దేవ్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు నాగమణి, డి హరినాథ్, కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మద్దిల మల్లేశ్వరరావు, అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నేతలు పాల్గొని ప్రసంగించారు.

పవన్‌కు తెలంగాణపై ఎందుకంత ప్రేమ? : పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు హఠాత్తుగా తెలంగాణపై ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందో రాష్ట్ర ప్రజలకు తెలపాలని ఎమ్మెల్యే పేర్ని నాని ప్రశ్నించారు. తెలంగాణ మంత్రులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటే స్పందించకపోగా, రాష్ట్రానికి మద్దతుగా మాట్లాడిన మంత్రులకు వ్యతిరేకంగా పవన్ మాట్లాడటం తగదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల కోసం అసత్యాల్ని వైసిపిపై రుద్ది, లేనిపోని ఆరోపణలతో తమపై బురదజల్లడం మానుకోవాలని అన్నారు. గతంలో కెసిఆర్‌ను తిట్టిన పవన్ ఇప్పుడు వెనకేసుకురావడం వెనుక అనుమానాలున్నాయని పేర్కొన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సిబిఐ విచారణ వక్రమార్గంలో జరుగుతుందని భావిస్తున్నామని చెప్పారు. అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే నడుస్తుందనే అనుమానాలున్నాయని తెలిపారు. సునీత, రామ్‌సింగ్ కలిసి చంద్రబాబు చెప్పినట్లు నడుస్తున్నారని విమర్శించారు.

హోదా, పోలవరం, ఉక్కు కోసం పోరాడండి

- ఎపి నాయకులకు హరీశ్‌రావు చురకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ నాయకులకు చేతనైతే అక్కడ ప్రజల సమస్యలపై పోరాడాలని తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎపి గురించి తాము ఏనాడూ తప్పుగా మాట్లాడలేదని ఆయన స్పష్టం చేశారు. సిద్దిపేటలో సోమవారం నిర్వహించిన బిఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు మాట్లాడారు. తాను అడిగినదానికి సమాధానం చెప్పలేకే.. అక్కడి నేతలు కొందరు ఎగిరెగిరి పడుతున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రయివేటుపరం కాకుండా ఉండేందుకు పోరాడాలని ఎపి నేతలకు సూచించారు.

తగ్గిన టోకు ద్రవ్యోల్బణం సూచీ

న్యూఢిల్లీ : దేశంలో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) ఎట్టకేలకు ఊరటనిచ్చింది. ప్రస్తుత ఏడాది మార్చిలో 1.34 శాతానికి తగ్గి 29 నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం ఫిబ్రవరిలో ఇది 3.85 శాతంగా చోటు చేసుకుంది. ముఖ్యంగా తయారీ ఉత్పత్తుల ధరలు తగ్గడంతో గత నెలలో ద్రవ్యోల్బణం దిగివచ్చిందని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. 2022 మార్చిలో డబ్ల్యుపిఐ ఏకంగా 14.63 శాతం గరిష్ట స్థాయికి ఎగిసింది. 2020 నవంబర్ నుంచి వరుసగా 18 మాసాల పాటు రెండంకెల స్థాయిలోనే కొనసాగుతూ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. గడిచిన ఆరు మాసాల నుంచి ఒక్క అంకె స్థాయిలో నమోదవుతోంది. కానీ.. టెక్నికల్‌గా తగ్గుతున్నట్లు కనబడుతున్నప్పటికీ .. ఇప్పటికే పెరిగి ఉన్న ధరల పట్ల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డ్ ఆఫీస్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ పోలీయో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు పబ్లిక్ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి (బ్యాంకు) యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.

అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ ఒప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జీగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి 25 ఏప్రిల్ 2023న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించడాని/పారవేయాలని నిర్ణయించింది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర. సం.	లోన్ ఎకౌంట్ నెం.	రుణగ్రహీతల పేర్లు	అసాధారణ మొత్తం 14 ఏప్రిల్ 2023 నాటికి	విక్రయ నోటీసు యొక్క తేదీ
1	XXXX1156	రాధాకృష్ణ మూర్తి దైవల	57,777.72	17-Apr-23
2	XXXX8961	ముల్లంగి సత్యకృష్ణవేణి	235,861.77	11-Apr-23

తేదీ: 18.04.2023
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్.

సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్.

kotak

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీస్: 27 బికెసి, సి 27, జి బ్లాక్, బాంద్ర కుర్ల కాంప్లెక్స్, బాంద్ర (ఈ), ముంబయి-400051
కార్పొరేట్ ఆఫీసు: కొటక్ ఇన్ఫినిటి, బిల్డింగ్ నెం.21, ఇన్ఫినిటి పార్క్, జనరల్ ఏ.కే వైద్య మార్గ్, మలడ్ (ఈ)), ముంబాయి-400097 www.kotak.com

వేలం-ప్రకటన

క్రింద పేర్కొన్న ప్రకారం, దిగువ తెలిపిన రుణగ్రహీత/లు బంగారు ఆభరణాలు/వస్తువులను సెక్యూరిటీగా పెట్టి బంగారు రుణ సదుపాయం పొంది ఉన్నారు. బాకీ మొత్తాలు మరియు వాయిదాలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత/లు విఫలమైనారు మరియు బాకీ మొత్తాలు తిరిగి చెల్లించుటకు రుణగ్రహీతలను పిలుస్తూ నోటీసులను జారీ చేయడమైనది. అయినప్పటికి, రుణగ్రహీత/లు బాకీ మొత్తాలను తిరిగి చెల్లించుట/క్లియర్ చేసుకోవడంలో విఫలమైనందున బ్యాంకు పేరునా తాకట్టుగా ఉన్న బంగారు ఆభరణాలను బ్యాంకు స్వాధీనపరుచుకొని వేలం వేస్తుంది.

దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాల వేలం ఇక్కడ నిర్వహించబడుతుంది:-

తేది: 26-ఏప్రిల్-2023 & 27-ఏప్రిల్-2023 & 28-ఏప్రిల్-2023, 29-ఏప్రిల్-2023,

సమయం: ఉ.11.00 గం.లకు ప్రదేశం: సంబంధిత శాఖ ఆవరణలు

ఎపిపిఎల్/ఎపిఎసి	పార్టీ పేరు	రాష్ట్రం	సబ్ లొకేషన్	బ్రాంచి పేరు	స్థూల బరువు	వేలం తేది
GLN2485008	ముల్లా తాహేర్	ఎపి	విజయవాడ	ఆదోని	54.70	26-Apr-23
GLN2511742	ముక్కు వెంకటేశ్వరరెడ్డి	ఎపి	విజయవాడ	అరండల్‌పేట	28.10	26-Apr-23
GLN2498148	నువ్వుల కామేశ్వరరావు	ఎపి	విజయవాడ	అరండల్‌పేట	15.20	26-Apr-23
GLN2501050	నువ్వుల కామేశ్వరరావు	ఎపి	విజయవాడ	అరండల్‌పేట	28.10	26-Apr-23
GLN1838963	గడిరాజు పద్మావతి	ఎపి	విజయవాడ	భీమవరం	62.40	27-Apr-23
GLN2389290	పోసినశెట్టి దుర్గా ప్రసాద్	ఎపి	విజయవాడ	భీమవరం	40.70	27-Apr-23
GLN2503162	కొత్తపల్లి జయకుమార్	ఎపి	విజయవాడ	చిత్తూరు	23.30	26-Apr-23
GLN2494217	ఎస్. కిరణ్ కుమార్	ఎపి	విజయవాడ	చిత్తూరు	29.00	26-Apr-23
GLN2310540	తుమ్మిశెట్టి క్రాంతి	ఎపి	విజయవాడ	కడప	48.40	27-Apr-23
GLN2399458	గాంధారి రఘునాథ్	ఎపి	విజయవాడ	దానవాయిపేట	64.70	28-Apr-23
GLN2242135	ఇసయ్య సాయిరాం	ఎపి	విజయవాడ	దానవాయిపేట	24.30	28-Apr-23
GLN2349720	ఇసయ్య సాయిరాం	ఎపి	విజయవాడ	దానవాయిపేట	15.60	28-Apr-23
GLN2427485	ఇసయ్య సాయిరాం	ఎపి	విజయవాడ	దానవాయిపేట	13.20	28-Apr-23
GLN2521499	పతివాడ శ్రీనివాసరావు	ఎపి	విజయవాడ	దానవాయిపేట	34.60	28-Apr-23
GLN2474636	కురాడ హారిక	ఎపి	విజయవాడ	ద్వారకానగర్	11.60	29-Apr-23
GLN2366370	త్రిమూర్తులు తంగెళ్ల	ఎపి	విజయవాడ	ద్వారకానగర్	48.80	29-Apr-23
GLN2418464	వన బాలకృష్ణ	ఎపి	విజయవాడ	ద్వారకానగర్	50.10	29-Apr-23
GLN2413402	దిడ్డి వీరభద్రరావు	ఎపి	విజయవాడ	గాజువాక	54.80	29-Apr-23
GLN2259940	గంట సంతోష్ కుమార్	ఎపి	విజయవాడ	గాజువాక	68.30	29-Apr-23
GLN2467544	గుడివాడ జనార్ధనరావు	ఎపి	విజయవాడ	గాజువాక	52.90	29-Apr-23
GLN2447312	కపక శైలజ	ఎపి	విజయవాడ	గాయత్రి నగర్	71.10	28-Apr-23
GLN2477681	నమల కల్పన	ఎపి	విజయవాడ	గాయత్రి నగర్	18.00	28-Apr-23
GLN2463222	రామ కోటేశ్వరరావు వేలిశెట్టి	ఎపి	విజయవాడ	గాయత్రి నగర్	62.80	28-Apr-23
GLN2466543	రామ కోటేశ్వరరావు వేలిశెట్టి	ఎపి	విజయవాడ	గాయత్రి నగర్	91.40	28-Apr-23
GLN2372311	తుమ్మలపాటి శ్రీనివాసరావు	ఎపి	విజయవాడ	గాయత్రి నగర్	16.00	28-Apr-23
GLN2460215	వెనిగళ్ల పావని	ఎపి	విజయవాడ	గాయత్రి నగర్	40.70	28-Apr-23
GLN2379674	ఇల్లూరి సంపత్ కుమార్	ఎపి	విజయవాడ	గిద్దలూరు	29.13	27-Apr-23
GLN2398780	సీలం జితేంద్ర	ఎపి	విజయవాడ	గిద్దలూరు	38.20	27-Apr-23
GLN2513855	షేక్ మహమ్మద్	ఎపి	విజయవాడ	కదిరి	44.10	26-Apr-23
GLN2292051	జంగం వాలేట్ దినకర్	ఎపి	విజయవాడ	కాకినాడ	28.00	27-Apr-23
GLN2519378	పలిక సురేష్ కుమార్	ఎపి	విజయవాడ	కాకినాడ	22.90	27-Apr-23
GLN2386530	పెన్నమరెడ్డి శివకుమార్	ఎపి	విజయవాడ	కాకినాడ	10.40	27-Apr-23
GLN2219991	డి. హరీష్	ఎపి	విజయవాడ	కర్నూలు	24.90	27-Apr-23
GLN2517208	మహమ్మద్ రబ్బాని బాషా	ఎపి	విజయవాడ	కర్నూలు	20.40	27-Apr-23
GLN2307278	పఠాన్ మహబూబ్ బాషా	ఎపి	విజయవాడ	కర్నూలు	36.60	27-Apr-23
GLN2418146	చెన్నూరి మురళీప్రసాద్	ఎపి	విజయవాడ	లబ్బీపేట	10.70	28-Apr-23
GLN2484662	దయల విద్యా సాగర్	ఎపి	విజయవాడ	లబ్బీపేట	27.20	28-Apr-23
GLN2327070	కలపల సంతోష్	ఎపి	విజయవాడ	లబ్బీపేట	14.20	28-Apr-23
GLN2470758	కుండ్లపుడి రాజరంగారెడ్డి	ఎపి	విజయవాడ	లబ్బీపేట	53.50	28-Apr-23
GLN2338504	షేక్ కరామతుల్ల	ఎపి	విజయవాడ	లబ్బీపేట	18.90	28-Apr-23
GLN2497408	షేక్ కరామతుల్ల	ఎపి	విజయవాడ	లబ్బీపేట	16.30	28-Apr-23
GLN2441302	షేక్ రబ్బాని	ఎపి	విజయవాడ	లబ్బీపేట	22.20	28-Apr-23
GLN2489261	దువూరి లలిత కామేశ్వరి	ఎపి	విజయవాడ	లలితా నగర్	25.20	29-Apr-23
GLN2511573	నీలకంఠ భార్గవి	ఎపి	విజయవాడ	లలితా నగర్	50.50	29-Apr-23
GLN2508727	బరితి రమణప్ప	ఎపి	విజయవాడ	మెయిన్ రోడ్డు	12.20	26-Apr-23
GLN2517752	బొప్పె పల్లి సాదక్ వలి	ఎపి	విజయవాడ	మెయిన్ రోడ్డు	67.20	26-Apr-23
GLN2449198	చింతామణి సాయి ప్రసాద్	ఎపి	విజయవాడ	మెయిన్ రోడ్డు	39.20	26-Apr-23
GLN2424801	కట్టె చెన్న కృష్ణ	ఎపి	విజయవాడ	మెయిన్ రోడ్డు	32.60	26-Apr-23
GLN2499881	చీటిరాల శ్రావణి	ఎపి	విజయవాడ	మార్గాపురం	52.70	21-Mar-23
GLN2499973	చీటిరాల శ్రావణి	ఎపి	విజయవాడ	మార్గాపురం	75.20	21-Mar-23
GLN2464391	కనమర్లపుడి వెంకట శ్రీనివాసరావు	ఎపి	విజయవాడ	మార్గాపురం	178.80	21-Mar-23
GLN2272340	పెంచికల కసయ్య	ఎపి	విజయవాడ	మార్గాపురం	48.50	27-Apr-23
GLN2203526	సయ్యద్ మస్తాన్ వలి	ఎపి	విజయవాడ	మార్గాపురం	19.20	27-Apr-23
GLN2526681	తమ్మిశెట్టి వెంకట రమణయ్య	ఎపి	విజయవాడ	మార్గాపురం	24.20	27-Apr-23
GLN2331657	గుంటక సురేష్ బాబు	ఎపి	విజయవాడ	ఎమ్‌జి రోడ్డు	21.50	28-Apr-23
GLN2213012	పేరేపి ఈశ్వరరావు	ఎపి	విజయవాడ	ఎమ్‌జి రోడ్డు	123.30	28-Apr-23
GLN2492682	చాకలి మనోహర్	ఎపి	విజయవాడ	నంద్యాల	31.50	27-Apr-23
GLN2445995	కనగాని గౌరీ లక్ష్మి తేజ	ఎపి	విజయవాడ	నంద్యాల	89.20	27-Apr-23
GLN2450579	కందల హర్ష వర్ధన్	ఎపి	విజయవాడ	నెల్లూరు	12.02	27-Apr-23
GLN2463931	కందల హర్ష వర్ధన్	ఎపి	విజయవాడ	నెల్లూరు	9.35	27-Apr-23
GLN2467038	నికిత కురపాటి	ఎపి	విజయవాడ	నెల్లూరు	60.84	27-Apr-23
GLN2503500	రాజు దాదసో బాబర్	ఎపి	విజయవాడ	నెల్లూరు	55.90	27-Apr-23
GLN2359032	బ్రంహ్మాజి కట్ట	ఎపి	విజయవాడ	పాలకొల్లు	17.50	28-Apr-23
GLN2453475	సాల ప్రసాద్	ఎపి	విజయవాడ	పాలకొల్లు	20.90	28-Apr-23
GLN2515278	కె. ప్రవీణ్‌కుమార్	ఎపి	విజయవాడ	పాపానాయుడు పేట	27.50	26-Apr-23
GLN2490160	మేకలతూరు గణేష్	ఎపి	విజయవాడ	పాపానాయుడు పేట	15.60	26-Apr-23
GLN2477421	రాకేష్	ఎపి	విజయవాడ	పాపానాయుడు పేట	15.80	26-Apr-23
GLN2436530	నున్న హేమంత్ కుమార్	ఎపి	విజయవాడ	పెదనందిపాడు	29.60	26-Apr-23
GLN2516709	పోలతోటి ప్రసాద్	ఎపి	విజయవాడ	పెదనందిపాడు	14.30	26-Apr-23
GLN2517921	పెద్ది శ్రీనివాసరావు	ఎపి	విజయవాడ	పెదనందిపాడు	53.10	26-Apr-23
GLN2525140	పులివర్తి రవీంద్ర	ఎపి	విజయవాడ	పెదనందిపాడు	13.30	26-Apr-23
GLN2421398	షేక్ ఖాజిబీ	ఎపి	విజయవాడ	పెద్దరావూరు	13.60	26-Apr-23
GLN2439851	గుబ్బల మల్లికారాణి	ఎపి	విజయవాడ	రావుపాలెం	11.90	28-Apr-23
GLN2212923	కుమారస్వామి కాటూరి	ఎపి	విజయవాడ	రావుపాలెం	8.00	28-Apr-23
GLN2282488	కుమారస్వామి కాటూరి	ఎపి	విజయవాడ	రావుపాలెం	26.80	28-Apr-23
GLN2499360	మేడిశెట్టి గురుదయాల సహజ్జీ	ఎపి	విజయవాడ	రావుపాలెం	82.20	28-Apr-23
GLN2421606	నరేష్ పొలబత్తుల	ఎపి	విజయవాడ	రావుపాలెం	7.30	28-Apr-23
GLN2363700	తమళ్ల నాగేశ్వరరావు	ఎపి	విజయవాడ	రావుపాలెం	16.60	28-Apr-23
GLN2509660	బి. విశ్వనాతహ రెడ్డి	ఎపి	విజయవాడ	రొంపిచెర్ల	61.10	26-Apr-23
GLN2525189	దుగ్గెం మోసెస్ బాబు	ఎపి	విజయవాడ	సత్యనారాయణపురం	31.30	28-Apr-23
GLN2170007	కొత్తమసు యు.వి. కృష్ణారావు	ఎపి	విజయవాడ	సత్యనారాయణపురం	23.10	28-Apr-23
GLN2401340	పందిరి పల్లి ప్రదీప్‌కుమార్	ఎపి	విజయవాడ	సత్యనారాయణపురం	80.90	28-Apr-23
GLN2257880	సంగ శరత్ సత్యసాయి	ఎపి	విజయవాడ	సత్యనారాయణపురం	20.80	28-Apr-23
GLN2517955	చిలకూరి సుబ్బరత్న	ఎపి	విజయవాడ	శ్రీకాళహస్తి	27.20	26-Apr-23
GLN2529106	కొవ్వూరి గృహలక్ష్మి	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	18.50	27-Apr-23
GLN2491271	సింహాద్రి జగదీష్ కుమార్	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	29.30	27-Apr-23
GLN2267917	ఎర్రంశెట్టి వీరాస్వామి నాయుడు	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	7.10	27-Apr-23
GLN2523660	ఎర్రంశెట్టి వీరాస్వామి నాయుడు	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	23.70	27-Apr-23
GLN2523805	ఎర్రంశెట్టి వీరాస్వామి నాయుడు	ఎపి	విజయవాడ	తాడేపల్లిగూడెం	10.30	27-Apr-23
GLN2505497	దుర్గా వైశాలి	ఎపి	విజయవాడ	తణుకు	16.20	27-Apr-23
GLN2451435	జుత్తిగ శ్రీనివాసు	ఎపి	విజయవాడ	తణుకు	7.40	27-Apr-23
GLN2481061	జుత్తిగ శ్రీనివాసు	ఎపి	విజయవాడ	తణుకు	14.40	27-Apr-23
GLN2510124	మల్లికరీయు గలి	ఎపి	విజయవాడ	తణుకు	35.60	27-Apr-23
GLN2425730	తోట శివపార్వతి	ఎపి	విజయవాడ	తణుకు	36.30	27-Apr-23
GLN2369667	డి.ముని లక్ష్మి	ఎపి	విజయవాడ	తిరుపతి	28.70	26-Apr-23
GLN2504029	ఎండ్ల పార్థసారధి	ఎపి	విజయవాడ	తిరుపతి	39.20	26-Apr-23
GLN2299395	ఎసనకుల విజయకుమార్ రెడ్డి	ఎపి	విజయవాడ	తిరుపతి	79.60	26-Apr-23
GLN2299453	ఎసనకుల విజయకుమార్ రెడ్డి	ఎపి	విజయవాడ	తిరుపతి	53.80	26-Apr-23
GLN2228656	కటారి లక్ష్మి అపర్ణ	ఎపి	విజయవాడ	తిరుపతి	160.90	26-Apr-23
GLN2295874	ఎస్. ఇక్బాల్	ఎపి	విజయవాడ	తిరుపతి	14.70	26-Apr-23
GLN1824538	రవడ స్వామి రాజు	ఎపి	విజయవాడ	వెంకోజిపాలెం	15.70	29-Apr-23
GLN2516693	సలన శ్రీనివాసరావు	ఎపి	విజయవాడ	వాల్టేర్	69.20	29-Apr-23

వేలం తేదిన రెండు ప్రస్తుత ఫోటోగ్రాఫ్‌లతో పాటు వెరిఫికేషన్ కొరకు ఒరిజినల్‌తో పాటు సంతకం మరియు చిరునామా గల వారి ఫోటో-ఐడెంటిటీ కాపీని సమర్పించగలరని బిడ్డర్లను అభ్యర్థించడమైనది. బిడ్డర్లకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా వేలం ను రద్దు లేదా వేలం యొక్క ప్రదేశం/తేది/సమయం మార్చే హక్కు బ్యాంకుకు కలదు.
వేలం పక్రియకు అయ్యే ఖర్చు ఖాతాదారు ఖాతాకు డెబిట్ అవుతుంది. బిడ్ మొత్తం ఖాతా మొత్తం చెల్లించుటలో తక్కువైనట్లయితే ఖాతాదారుని నుండి మిగిలిన మొత్తంను వసూలు చేసే హక్కు బ్యాంకుకు కలదు.
వేలం యొక్క నియమాలు మరియు నిబంధనల సంబంధించి ఏవైనా పూర్తి వివరాల కొరకు, మీరు అవసరమైతే దిగువ తెలిపిన వ్యక్తి/లను సంప్రదించగలరు.

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, ఫోన్ : 9160017918

సంపాదకీయం

యు.పి లో మర్డర్ రాజ్

పోలీస్ కస్టడీ లోనే గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతని సోదరుడు అష్రాఫ్ హత్యోదంతం ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని బిజెపి జమానాలో శాంతిభద్రతల వైఫల్యాన్ని సూచిస్తుంది. రాష్ట్రంలో చట్ట వ్యతిరేక పాలన నడుస్తోందని అక్కడి ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల కార్యకర్తలు ఘోషిస్తున్నారు. యోగి సర్కారు ఆ విమర్శలను చెవికెక్కించుకోకపోగా ముందుకేనంటోంది. గతంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీగా పని చేసిన అతీక్, అతని సోదరుడు అష్రాఫ్‌లను ఒక కేసులో విచారణ నిమిత్తం శనివారం కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు, అనంతరం జైలుకు తరలించే క్రమంలో వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతి సమీపం నుంచి తుపాకులతో అతీక్, అష్రాఫ్‌లను కాల్చి చంపారు. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగింది. కాల్పులు జరిపిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంతకుముందు చిన్న కేసుల్లో వీళ్లు నిందితులని, పేరు కోసం, పెద్ద డాన్‌లుగా మారి నేర సామ్రాజ్యాన్ని ఏలడం కోసం జర్నలిస్టుల ముసుగులో వచ్చి కాల్పులు జరిపారని పోలీసులు వల్లె వేశారు. యోగి ప్రభుత్వం ముగ్గురితో జ్యుడీషియల్ కమిటీ వేసింది. చూస్తుంటే పోలీసులు అల్లిన కట్టు కథకు ఆ కమిటీ సర్టిఫై చేసేలా కనిపిస్తోంది.

ఎన్‌కౌంటర్లు, కస్టడీ హత్యల సమయంలో పోలీసులు చెప్పే కథలన్నీ పూసగుచ్చినట్లు ఒకే విధంగా ఉంటాయి. యు.పి. ప్రయాగ్‌రాజ్ లోనూ అదే స్క్రిప్టు పునరావృతమైంది. పేరుమోసిన గ్యాంగ్‌స్టర్లను తరలించేటప్పుడు కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. బయటి నుంచి వ్యక్తులొచ్చి పాయింట్ బ్లాంక్‌లో తుపాకీ గురిపెట్టి కాల్చడం పోలీసుల మద్దతుతోనే జరుగుతుంది. ఇటువంటి ఘటనలు ప్రభుత్వానికి తెలీకుండా జరగవు. కచ్చితంగా ప్రభుత్వ కుట్ర ఉండి తీరుతుంది. అతీక్, అష్రాఫ్‌ల హత్యలకు రెండు రోజుల ముందు గురువారం ఝాన్సీ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతీక్ కుమారుడు అసద్, అతని సహచరుడు గులాం హతులయ్యారు. ఉమేష్‌పాల్ హత్య కేసులో వీరు నిందితులు. 2005లో జరిగిన బిఎస్‌పి ఎంఎల్‌ఎ రాజ్‌పాల్ హత్య కేసులో ఉమేష్‌పాల్ కీలక సాక్షి. ఆ ఉమేష్ పాల్ ఈ ఏడాది ఫిబ్రవరి 24న మర్డర్ అయ్యాడు. ఆ కేసులో అతీక్, అష్రాఫ్, అసద్, గులాం నిందితులు. ఆ నలుగురూ హతమయ్యారు. దర్యాప్తులు, కోర్టులు ఇవేమీ లేకుండా నిందితులను లేపేయడమనే సిద్ధాంతాన్ని యోగి ప్రభుత్వం అమలు చేస్తోందని అర్థమవుతోంది. అది కూడా ఒక మతానికి సంబంధించిన వారే లక్ష్యం.

యు.పి. లో యోగి ప్రభుత్వం వచ్చింది మొదలు ముస్లింల అక్రమ నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు అప్రతిహతంగా సాగిపోతున్నాయి. వాటిపై దర్యాప్తులు, విచారణలు ఏమీ లేవు. రాష్ట్రంలో నేరస్తుల, అసాంఘిక శక్తుల పీచమణిచేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నామని యోగి సర్కారు తమ చట్ట వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను సమర్ధించుకుంటోంది. ఇదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మతోన్మాద మూకలు, ప్రైవేటు సైన్యాలకు పూర్తి మద్దతిస్తోంది. గోరక్షణ పేరిట యు.పి. లో ముస్లింలు, దళితులపై జరిగిన దాడులు అన్నీ ఇన్నీ కావు. తరచూ పురివిప్పుతున్న మత ఘర్షణలను అదుపు చేయడంలో వైఫల్యాలను మూటగట్టుకోవడంతో పాటు ఒక వర్గానికి ప్రభుత్వం కొమ్ము కాస్తోంది. ప్రజాస్వామ్యం, లౌకికతత్వంపై దాడి చేస్తోంది. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను ప్రభుత్వమే కాలరాస్తోంది. నేరస్తులను చట్ట ప్రకారం శిక్షించాలి. అందుకు ఎవ్వరూ కాదనరు. ప్రభుత్వమే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే క్రిమినల్స్‌కు, చట్టబద్ధ పాలన చేస్తామనే రాజ్యానికి తేడా ఉండదు. వంద మంది దోషులు తప్పించుకోవచ్చేమో, ఒక నిర్దోషికి శిక్ష పడకూడదనేది మన న్యాయ వ్యవస్థ అభిలాష. యు.పి. హత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో ఉన్నత స్థాయి విచారణ జరిపించేందుకు యోగి సర్కారు ముందుకు రావాలి.

మహనీయుల మాట

నీవు ఒక సమస్యను చేపట్టావంటే...
దానిపై లోతుగా అధ్యయనం
చేయకుండా
మాట్లాడే హక్కు నీకు లేదు.

- మావో

ద్రవ్యోల్బణం - పెట్టుబడిదారీ వ్యవస్థ

ప్రభాత్ పట్నాయక్

కరెన్సీ విలువ పడిపోతున్నప్పుడు (దానినే ద్రవ్యోల్బణం అంటాం) దానిని అరికట్టడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక వ్యవస్థలో మాంద్యాన్ని సృష్టిస్తుంది (అంటే సరుకుల ఉత్పత్తి వృద్ధి చెందే వేగాన్ని తగ్గిస్తుంది.). నిజానికి ద్రవ్యోల్బణం ఫలితంగా పెట్టుబడిదారుల లాభాల వాటా పెరుగుతుంది (ద్రవ్యోల్బణం భారాలు అటు వినియోగదారులపైన, ఇటు కార్మికులపైన పడతాయి. వినియోగదారులు ఎక్కువ కరెన్సీ చెల్లించి సరుకులు కొనుక్కోవలసి వస్తుంది. కార్మికుల వేతనాల నిజ విలువ పడిపోతుంది. అందువలన పెట్టుబడిదారులకు వచ్చే లాభాలు పెరుగుతాయి). ఒకసారి పెరిగిన లాభాల వాటాను ఆ తర్వాత తగ్గించుకోడానికి పెట్టుబడిదారులు ఎప్పుడూ సిద్ధంగా ఉండరు. ఒకసారి మాంద్యం మొదలైతే అప్పుడు సరుకుల ఉత్పత్తికి అవసరమయ్యే ముడిసరుకులకు డిమాండ్ తగ్గుతుంది. అప్పుడు ఆ ముడిసరుకుల రేట్లు తగ్గిపోతాయి (వాటిని అమ్మే రైతాంగం దాని ఫలితంగా ఎక్కువ నష్టపోతారు). అప్పుడు ద్రవ్యోల్బణం తగ్గుతుంది. అదే సమయంలో ఆర్థికమాంద్యం నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. దాని వలన కార్మికులు మెరుగైన జీతాల కోసం బేరసారాలాడే శక్తి కోల్పోతారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ జీతాలను పెంచుకోలేకపోతారు.

ద్రవ్యోల్బణం ఎందుకు కలుగుతుంది? పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో జరిగే ఉత్పత్తిలో వాటాదారులు ముగ్గురు. ఒకరు పెట్టుబడిదారులు, రెండవవారు కార్మికులు, మూడవవారు ముడిసరుకులను అందించే వారు (వారిలో రైతులు ఒక భాగం). జరిగిన ఉత్పత్తి విలువ కన్నా ఈ ముగ్గురూ తమ తమ వాటాలుగా కోరుకునేదాని విలువ ఎక్కువ అయిపోతే అప్పుడు ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. అప్పుడు పెట్టుబడిదారీ వర్గం తన వాటాను తగ్గించుకోకుండా తక్కిన ఇద్దరు వాటాదారులకూ దక్కవలసినదానిని తగ్గించివేసి, తద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తుంది. అలా ఆ ఇద్దరు వాటాదారులకూ దక్కవలసిన వాటాలను తగ్గించే మార్గమే ఆర్థిక మాంద్యం.

ప్రస్తుత ద్రవ్యోల్బణానికి బలౌతున్నది కార్మికవర్గమే అని ఒకవైపు ఉదారంగా అంగీకరిస్తున్న ఆర్థికవేత్తలు మరోవైపు కార్మికుల వేతనాలను తగ్గించడం ద్వారానే ఆ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయవచ్చునని సిఫార్సు చేస్తున్నారు! ఇది పెట్టుబడిదారీ వర్గం ముందుకు తెచ్చే వాదన. ఈ ఉదారవాద ఆర్థికవేత్తలు కూడా ఆ పెట్టుబడిదారీ వ్యవస్థకే కట్టుబడివున్నవారు అవడం చేత వారి దృక్పథం కూడా ఆ చట్రం పరిధిలోనే సంచరిస్తోంది. అందుచేత ఎవరైనా ద్రవ్యోల్బణం కారణంగా కార్మికవర్గం నష్టపోతోందని వాపోతున్నారంటే అటువంటి వారందరూ కార్మికవర్గానికి అనుకూలంగానే ఉన్నారని అనుకోలేము. ఆ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి వారేమి చర్యలను సిఫార్సు చేస్తున్నారనేది ఇక్కడ ముఖ్యం. సంపన్న వర్గాల దగ్గరున్న ఆస్తుల విలువలు ఎట్టిపరిస్థితుల్లోనూ పడిపోకూడదని కోరుకునేవారు కార్మికవర్గం పొందుతున్న వేతనాలను అదుపు చేయడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయవచ్చునని వాదిస్తారు.

> **సంపన్న వర్గాల దగ్గరున్న ఆస్తుల విలువలు ఎట్టిపరిస్థితుల్లోనూ పడిపోకూడదని కోరుకునేవారు కార్మికవర్గం పొందుతున్న వేతనాలను అదుపు చేయడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయవచ్చునని వాదిస్తారు.**

కార్మికుల వేతనాలను, ముడిసరుకుల ధరలను తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి పెట్టుబడిదారీ వర్గం పూనుకుంటుందని నేను పైన చెప్పాను. ఆ రెండు తరగతులలో (కార్మికులు, ముడిసరుకుల సరఫరాదారులు) ఎవరైనా ఒక తరగతివారు గనుక తమ రేట్లను తగ్గించడానికి ఒప్పుకోకుండా ప్రతిఘటిస్తే అప్పుడు ఆ రెండో తరగతి మీద మరింత భారాన్ని మోపడానికి పెట్టుబడిదారీ వర్గం పూనుకుంటుంది. ప్రస్తుతం అదే జరుగుతోంది.

చమురు ఉత్పత్తి దేశాలు (ఇందులో ఒపెక్ గా ఒక కూటమిగా ఉన్నవి 13 కాగా ఆ కూటమిలో లేనివి రష్యాతో కలుపుకుని మరో 11 దేశాలు ఉన్నాయి) మొత్తం 24 ఇటీవలే, ఏప్రిల్ 2న తమ రోజువారీ ఉత్పత్తిని ఒక మిలియన్ బ్యారెళ్ళమేరకు (10 లక్షల బ్యారెళ్ళ మేరకు) మే ఒకటవ తేదీ నుండి తగ్గించాలని, ఈ తగ్గింపు కనీసం ఈ 2023 చివరి దాకా కొనసాగించాలని నిర్ణయించాయి. ఇంతకు ముందే అక్టోబర్ 2022లో ఒపెక్ దేశాలు తమ రోజువారీ ఉత్పత్తిని రెండు మిలియన్ల బ్యారెళ్ళ మేరకు తగ్గించాలని నిర్ణయించి వున్నాయి. ఇప్పుడు అదనంగా మరో మిలియన్ బ్యారెళ్ళు తగ్గించబోతున్నారు. ఆ విధంగా తగ్గించవద్దని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చాలా పెద్ద ఎత్తున రాయబారాలు నడిపాడు. తాను చాలా దేశాలకు స్వయంగా పర్యటించడమే కాక, తన క్యాబినెట్ మంత్రులను చాలా దేశాలకు పంపాడు. అయినా ఉపయోగం లేకపోయింది. తాజా తగ్గింపు విషయంలో కూడా అమెరికా చాలా గట్టిగా వ్యతిరేకించింది. అయినా చమురు దేశాలు తగ్గింపుకే సిద్ధపడ్డారు. అమెరికా పెత్తనం బలహీన పడుతోందనడానికి ఈ పరిణామాలు సంకేతాలు.

ఇంతకూ తమ ఉత్పత్తులను తగ్గించుకోవాలని చమురు ఉత్పత్తి దేశాలు ఎందుకు భావించాయి? ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థికమాంద్యం కారణంగా చమురు ఉత్పత్తులకు డిమాండ్ తగ్గిపోతోంది. దాని ఫలితంగా చమురు ధరలు పడిపోతున్నాయి. ఆ విధంగా తక్కువ ధరలకు చమురును అమ్ముకోవడం కన్నా ఉత్పత్తిని తగ్గించుకుని చమురు ధర పడిపోకుండా చూసుకోవడం మంచిది. చమురుకు డిమాండ్ ఎంతమేరకు తగ్గుతుంటే అంతమేరకు ఉత్పత్తిని గనుక తగ్గించుకుంటే అప్పుడు చమురు ధర పడిపోకుండా స్థిరంగా నిలబడుతుంది. అదే చమురు ఉత్పత్తిని తగ్గించుకోకపోతే అప్పుడు ధర పడిపోయి నష్టం ఎక్కువగా ఉంటుంది. మార్కెట్ లో చమురు ఉత్పత్తులకు ఎంత డిమాండ్ ఉందో అంతమేరకే చమురును ఉత్పత్తి చేస్తే అప్పుడు చమురు ధరలు తమ అదుపులో ఉంటాయి... ఇదే చమురు ఉత్పత్తి దేశాల ఆలోచన. చమురు ఉత్పత్తిపై ఆ విధమైన అదుపును కొనసాగించగలుగుతున్నందువల్లనే చమురు ఉత్పత్తి దేశాలు తాము కావాలనుకున్నప్పుడల్లా చమురు ధరలను పెంచివేయగలుగుతున్నాయి. నిజానికి ఈ దేశాలు తమ చమురు ఉత్పత్తులను తగ్గించుకుంటున్నాయి అన్న వార్త రాగానే, ఇంకా వాస్తవంగా ఉత్పత్తి తగ్గింపు అమలులోకి రానప్పటికీ, ముడిచమురు ధరలు 6 శాతం పెరిగిపోయాయి. కొన్ని చమురు ఉత్పత్తి కంపెనీల వాటాల ధరలు కూడా పెరగడం మొదలైంది.

ఎప్పుడైతే చమురు ఉత్పత్తి దేశాలు ఈ విధంగా తమ ఉత్పత్తుల ధరలు పడిపోకుండా చూసుకుంటున్నాయో, అప్పుడు పెట్టుబడిదారీ వర్గం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి చేస్తున్న ప్రయత్నం వెనకపట్టు పడుతుంది (అంటే ముడి సరుకుల ధరలను, కార్మికుల వేతనాలను తగ్గించడం ద్వారా ఆర్థిక మాంద్యాన్ని పెంచడానికి ప్రయత్నించడం). ఆ విధంగా జరగకూడదనుకుంటే అప్పుడు పెట్టుబడిదారీ వర్గం చమురు ఉత్పత్తిదారులు మినహా తక్కిన ముడిసరుకుల ఉత్పత్తిదారుల మీద (ప్రధానంగా రైతుల మీద), కార్మికుల మీద మరింత ఎక్కువగా భారాలను మోపాలి. మరింత ఎక్కువగా వారి వేతనాలకు కోత పెట్టాలి.

ఆ విధంగా పెట్టుబడిదారీ వర్గం పూనుకుంటే అప్పుడు కార్మికవర్గం వైపు నుండి ప్రతిఘటన కూడా పెరుగుతుంది. ఒకపక్క ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా, మరోవైపు వేతనాల కుదింపుకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాల్లోకి వస్తారు. ఇప్పటికే యూరప్ ఖండం అంతా కార్మిక పోరాటాల వెల్లువలతో అట్టుడుకుతోంది.

అంతేకాదు. ఆర్థిక మాంద్యం ప్రభావం బ్యాంకుల మీద ఒత్తిడిని పెంచుతుంది. సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని బ్యాంకింగ్ వ్యవస్థ మీద ఇప్పటికే పెరుగుతున్న ఒత్తిడి ఫలితంగా రెండు అమెరికన్ బ్యాంకులు మూతబడ్డాయి. ఆర్థిక మాంద్యం మరింత పెరిగి, దాని ఫలితంగా బ్యాంకులకు కట్టవలసిన అప్పుల వాయిదాలు కట్టలేనివారి సంఖ్య మరింత పెరిగితే అప్పుడు పరిస్థితి మరింత దారుణంగా తయారౌతుంది.

పెట్టుబడిదారీ విధానం పైకి చూసినప్పుడు చాలా సాఫీగా నడుస్తున్న వ్యవస్థ లాగా అనిపిస్తుంది. అయితే ఆ వ్యవస్థ ఆ విధంగా కొనసాగాలంటే చాలా నిబంధనలు లేదా షరతులు అమలు కావల్సి వుంటుంది. వాటిలో ఏ ఒక్కటి అమలు కాకుండా పోయినా, దాని పర్యవసానంగా గొలుసుకట్టు మాదిరిగా తేడాలు ఒకదాని వెంట ఒకటిగా తన్నుకొస్తాయి. అందువలన మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడే ప్రమాదంలో పడిపోతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద అమెరికా నాయకత్వంలో ఉన్న సంపన్న పశ్చిమ దేశాల పెత్తనం కొనసాగడం అనేది అటువంటి షరతులలో ఒకటి. ఇన్నాళ్ళూ ఆ పెత్తనం కొనసాగుతూ వచ్చినందువలన దాని ప్రాధాన్యతను చాలామంది ఆర్థిక విశ్లేషకులు గమనించలేకపోతున్నారు. కాని ఇప్పుడు ఒక్కసారి ఆ పెత్తనాన్ని కాదని ఒక్క దేశం, సౌదీ అరేబియా, చమురు ఉత్పత్తిని తగ్గించుకోడానికే నిర్ణయించుకోగానే దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో చూడండి. మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థనే సవాలు చేసే పరిణామాలు తలెత్తుతున్నాయి.

నిజానికి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా కాలం క్రితం నుండే సంక్షోభంలో ఉంది. 2008లో హౌసింగ్ బుడగ పేలిపోయినప్పటి నుంచీ అదే పరిస్థితి. ఒక సంక్షోభంలోనుండి బైట పడడానికి అది తీసుకునే చర్యలు ఆ వ్యవస్థను మరొక రూపంలో ఉండే సంక్షోభంలోకి నెడతాయి. మొదట సంక్షోభం ఆర్థిక మాంద్యం రూపంలో వచ్చింది. దానినుండి బైట పడడానికి చాలా దీర్ఘకాలం పాటు అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను అందించారు. దానితోబాటు కరోనా సమయంలో పెద్ద మోతాదులో ద్రవ్యలోటు పెంచి ప్రభుత్వ వ్యయాన్ని పెంచారు. ఇప్పుడు ఆ చర్యల ఫలితంగా ద్రవ్యోల్బణం వచ్చింది. ఇక అమెరికా పెత్తనం ఈ ప్రపంచం మీద కొనసాగించాలనే పంతంతో కొనసాగిస్తున్న ఉక్రెయిన్ యుద్ధం కూడా ద్రవ్యోల్బణానికి తోడైంది. ఇప్పుడు ఆ ద్రవ్యోల్బణం అమెరికా కొనసాగిస్తున్న పెత్తనానికే ఎసరు పెట్టింది. దానికి తోడు కార్మికవర్గం నుండి ప్రతిఘటన కూడా పెరుగుతోంది. ప్రస్తుతం మనం నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కోల్పోయి బీటలు వారడాన్ని చూస్తున్నాం.

(స్వేచ్ఛానుసరణ)

> **మొదట సంక్షోభం ఆర్థిక మాంద్యం రూపంలో వచ్చింది. దానినుండి బైట పడడానికి చాలా దీర్ఘకాలం పాటు అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను అందించారు. దానితోబాటు కరోనా సమయంలో పెద్ద మోతాదులో ద్రవ్యలోటు పెంచి ప్రభుత్వ వ్యయాన్ని పెంచారు. ఇప్పుడు ఆ చర్యల ఫలితంగా ద్రవ్యోల్బణం వచ్చింది. ఇక అమెరికా పెత్తనం ఈ ప్రపంచం మీద కొనసాగించాలనే పంతంతో కొనసాగిస్తున్న ఉక్రెయిన్ యుద్ధం కూడా ద్రవ్యోల్బణానికి తోడైంది. ఇప్పుడు ఆ ద్రవ్యోల్బణం అమెరికా కొనసాగిస్తున్న పెత్తనానికే ఎసరు పెట్టింది. దానికి తోడు కార్మికవర్గం నుండి ప్రతిఘటన కూడా పెరుగుతోంది. ప్రస్తుతం మనం నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కోల్పోయి బీటలు వారడాన్ని చూస్తున్నాం.**

విమర్శ

బిజెపి మూడు నినాదాలు - అమలు తీరు

వి. రాంభూపాల్

2014 ఎన్నికల నాటికి ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, అవినీతి అంశాలను బిజెపి ఎన్నికల అస్త్రాలుగా మలుచుకుంది. దేశంలోని అవినీతిపరులు దేశ సంపదను లూటీ చేసి స్విస్ బ్యాంకుల్లో లక్షల కోట్లు దాచుకున్నారని, వాటికి దేశ ప్రజలకు పంచితే ఒక్కొక్కరికి 15 లక్షల రూపాయలు వస్తాయని, ప్రతి ఒక్కరి అకౌంట్‌లో వేస్తామని బిజెపి వాగ్దానం చేసింది. ప్రతి సంవత్సరం 10 నుండి 18 వేల మంది వ్యవసాయదార్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీన్ని నివారించడానికి పంట పెట్టుబడికి రెండు రెట్లు ఆదాయం వచ్చేట్లు చేస్తామన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత శక్తి వృధా అవుతున్నది. అందువల్ల ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ హామీలను సాధించగలిగే శక్తి, యుక్తి, దేశాన్ని ముందుకు తీసుకుపోయే సామర్థ్యం నరేంద్ర మోడీకి మాత్రమే వున్నాయని ముందుగా రంగరించుకున్న స్క్రిప్ట్ ప్రకారం మీడియా హోరెత్తించింది. బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ తన శక్తి కొద్దీ ప్రజల్లో మత విభజన తీసుకొచ్చి ఎన్నికలను ప్రభావితం చేసింది.

కార్పోరేట్ల కొమ్ముకాస్తున్న బిజెపి విధానాలు

తొమ్మిది సంవత్సరాల అనుభవం నాడు బిజెపి ఇచ్చిన హామీలన్నింటిని గేలి చేస్తున్నది. గతంలో వున్న వ్యక్తిగత అవినీతి ఈ కాలంలో వ్యవస్థీకృతమైంది. అవినీతి, అక్రమాలు చేయకుండానే చట్టప్రకారమే దేశ సంపదను ఎలా కొల్లగొట్టవచ్చో బిజెపి పాలన రుజువు చేసింది. బ్యాంకుల్లో దాచుకున్న ప్రజల సంపదను అప్పుల రూపంలో కాజేసి విదేశాలకు వెళ్లి జల్సాలు చేస్తున్న అస్మదీయుల జాబితా అంతకంతకూ పెరిగిపోయింది. దేశంలో అత్యంత ధనవంతులైన 30 శాతం మంది దగ్గర దేశ సంపదలో 90 శాతం, అందులో 10 శాతం కుబేరుల వద్ద 80 శాతం, అందులో 5 శాతం అపర కుబేరుల వద్ద 62 శాతం, ఇందులో ఒక్క శాతంగా వున్న మహాకుబేరుల వద్ద 40.6 శాతం సంపద పోగుబడింది. బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న బడా కార్పోరేట్ కంపెనీలకు మోడీ పాలనలో రూ. 10 లక్షల 72 వేల కోట్ల రూణాలు రద్దు చేశారు. 13 కంపెనీలు బ్యాంకుల్లో తీసుకున్న రూ.4 లక్షల 50 వేల కోట్ల రుణాలను రూ.లక్ష 61 వేల కోట్లకు తగ్గించి 'సెటిల్‌మెంట్' చేశారు. కార్పోరేట్ అవినీతి, అక్రమాలకు ప్రధాని ప్రియ మిత్రుడు గౌతమ్ అదానీ ఉదంతం పెద్ద ఉదాహరణ. తొమ్మిది సంవత్సరాల క్రితం దేశీయ సాధారణ పెట్టుబడిదారుడుగా వున్న గౌతమ్ అదానీ ఈ కాలంలో ప్రపంచ నెంబర్ 2 కుబేరుడుగా మారి, ప్రస్తుతం 25వ స్థానానికి దిగజారాడు. ఈ ఎగుడు, దిగుడు వెనుక వున్న కారణాలను కనిపెట్టేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటి (ఇందులో సహజంగానే బిజెపి ఎంపీలు ఎక్కువ వుంటారు) వేయడానికి కూడా బిజెపి సిద్ధం కాలేదు. అదానీ అక్రమాల్లో ప్రతిష్టాత్మకమైన ఎల్‌ఐసి రూ.38,745 కోట్లు నష్టపోయింది. 2016-20 మధ్య కాలంలో ముఖేష్ అంబానీ నికర సంపద 350 శాతం పెరగగా, అదానీ సంపద 750 శాతం పెరిగింది. దేశం మొత్తం సంపదలో 77.4 శాతం కేవలం 10 శాతం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లింది. మరోవైపు దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. బిజెపి అధికారంలోకి వచ్చే 2014-15 నాటికి రూ.62,78,553 కోట్ల అప్పులు వుంటే 2022-23 నాటికి రూ. 155.8 లక్షల కోట్లకు పెరిగింది. దేశ స్థూల ఉత్పత్తిలో అప్పుల వాటా 2022-23 బడ్జెట్ అంచనా ప్రకారం 57.3 శాతంగా వుంది.

తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం

దేశంలో అత్యధిక మందికి ఆధారంగా వున్న వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తూనే వున్నది. మూడు నల్ల చట్టాలను తెచ్చి వాటి అమలు కోసం మొండిగా వ్యవహరించి వందలాది రైతుల ప్రాణాలను బలితీసుకుంది. ప్రభుత్వ విధానాల వల్ల విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరిగిపోయాయి. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పంటల సాగే తగ్గించుకుంటున్న స్థితి వలస పాలన కాలం నాటి చేతివృత్తిదారులను గుర్తుచేస్తున్నది. వ్యవసాయాన్ని గిట్టుబాటు కాని పరిస్థితికి నెట్టి కార్పోరేట్ కంపెనీలు ఆక్రమించుకునేలా చేయడం బిజెపి విధానం. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే వున్నాయి. కేంద్ర నేర పరిశోధనా సంస్థ రిపోర్టు ప్రకారం 2016లో 11,379 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా...2017లో 10,655 మంది, 2018లో 10,349 మంది, 2019లో 10,281 మంది, 2020లో 10,677 మంది, 2021లో 10,881 మంది, 2022లో పది వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా వున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం వీలైనంత బలహీనం చేస్తున్నది. 2020-21 కేంద్ర బడ్జెట్ సవరించిన అంచనాల్లో కోట్లాది వ్యవసాయ కూలీల కోసం ఉద్దేశించిన ఈ పథకానికి రూ.1,10,000 కోట్లు కేటాయిస్తే, 2021-22 బడ్జెట్‌లో రూ.73,000 కోట్లు మాత్రమే కేటాయించారు. చేసిన పనికి కూలీ డబ్బులు రాక పేదలు పస్తులతో, అర్థాకలితో జీవిస్తున్నారు. వ్యవసాయ సంక్షోభం నానాటికి తీవ్రమై కోట్లాది మంది ఆ రంగాన్ని వదిలేస్తున్నారు. కొత్త ఉద్యోగాలు లేవు. అరకొర ఉపాధి లభించినా భద్రత లేదు.

నిరుద్యోగ భారతం

2019లో 18.7 కోట్ల మంది నిరుద్యోగులు వుంటే 2022 నాటికి వారి సంఖ్య 20.5 కోట్లకు పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కొత్త ఉద్యోగాల భర్తీ నిలిపివేత వల్ల 2014లో 16.5 లక్షలుగా ఉన్న ఉద్యోగుల సంఖ్య 2020 నాటికి 9.80 లక్షలకు తగ్గింది. బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల 7 లక్షల 84 వేల 841 రిజిష్టర్ కంపెనీలు మూతపడ్డాయి. అంటే సగటున రోజుకు 270 కంపెనీలు బోర్డులు తిప్పేశాయి. ఇందులో పనిచేసే లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం కోసమే బిజెపి పాలన సాగిస్తున్నట్లు వుంది. గత ఎనిమిది సంవత్సరాల్లో ప్రభుత్వ సంస్థల్లో వాటాలు అమ్మి రూ.4,32,708 కోట్లు కేంద్రం సొమ్ము చేసుకుంది. కాగా ఈ సంవత్సరం మరిన్ని గనులు, రేవులు, స్టేడియమ్‌లు, విమానాశ్రయాలను అమ్మివేయాలని నిర్ణయించింది. 26,700 కి.మీ జాతీయ రహదార్లను అమ్మివేసి 1.6 లక్షల కోట్లు, 400 రైల్వేస్టేషన్లు, 150 రైళ్లు, ట్రాకులు అమ్మడం ద్వారా రూ.1.5 లక్షల కోట్లు...ఇలా మొత్తంగా ఈ సంవత్సరం రూ.6 లక్షల కోట్లు సేకరించాలని నిర్ణయించింది. ఏడాదికి రెండు కోట్ల చొప్పున మోడీ ఇస్తానన్న కొత్త ఉద్యోగాలు ఈ ప్రైవేటీకరణ వేగంలో పడి కొట్టుకుపోయాయి.

ఎన్నికల నాడు ఇచ్చిన హామీల గురించి ప్రజలు ప్రశ్నించకుండా వుండాలంటే సున్నితమైన భావాల చుట్టూ ప్రజల ఆలోచనలు మార్చి...తమకు అనుకూలమైన కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచి పెట్టడం, తద్వారా సంపద పోగేసుకొని ఎన్నికల్లో గెలవడం, తమ సంస్థలను బలోపేతం చేసుకోవడం ఫాసిజం లక్షణం. అదే విధానం నేడు దేశంలో అమలవుతున్నది. ప్రతి విషయాన్ని మత కోణం నుండి చూయిస్తూ మైనారిటీలను శత్రువులుగా చూపిస్తున్నది. వ్యక్తిగత అంశమైన మత విశ్వాసాలను సమాజంలోకి, రాజకీయాల్లోకి లాక్కొచ్చి ప్రజల మధ్య విభజనలు సృష్టించి లాభపడాలని చూస్తోంది. ఆనందంతో జరుపుకోవలసిన పండుగలు, ఉత్సవాల సందర్భంగా మత ఘర్షణలు రగిలించడానికి పూనుకుంటున్నది. శ్రీరామనవమి సందర్భంగా జరిగిన శోభాయాత్ర వివిధ రాష్ట్రాలలో శోకయాత్రగా ఎలా మారిందో చూశాము. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, ప్రజావ్యతిరేక, మతతత్వ విధానాలను ప్రజలలో ఎండగట్టి...బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందాం...అనే నినాదంతో ఈ నెల 14 నుండి 30 వరకు సిపిఐ-సిపిఐ(ఎం) పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార భేరి నిర్వహిస్తున్నాయి.

(వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు)

> **బ్యాంకుల్లో దాచుకున్న ప్రజల సంపదను అప్పుల రూపంలో కాజేసి విదేశాలకు వెళ్లి జల్సాలు చేస్తున్న అస్మదీయుల జాబితా అంతకంతకూ పెరిగిపోయింది. దేశంలో అత్యంత ధనవంతులైన 30 శాతం మంది దగ్గర దేశ సంపదలో 90 శాతం, అందులో 10 శాతం కుబేరుల వద్ద 80 శాతం, అందులో 5 శాతం అపర కుబేరుల వద్ద 62 శాతం, ఇందులో ఒక్క శాతంగా వున్న మహాకుబేరుల వద్ద 40.6 శాతం సంపద పోగుబడింది. బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న బడా కార్పోరేట్ కంపెనీలకు మోడీ పాలనలో రూ. 10 లక్షల 72 వేల కోట్ల రూణాలు రద్దు చేశారు. 13 కంపెనీలు బ్యాంకుల్లో తీసుకున్న రూ.4 లక్షల 50 వేల కోట్ల రుణాలను రూ.లక్ష 61 వేల కోట్లకు తగ్గించి 'సెటిల్‌మెంట్' చేశారు.**

అభిప్రాయం

పుల్వామా - మోడీ డ్రామా

పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్‌కి సంబంధించిన (సిఆర్‌పిఎఫ్) జవాన్లను తరలిస్తున్న కాన్వాయి మీద కారు బాంబు రూపంలో ఆత్మాహుతి దాడి చేయటంతో 76వ బెటాలియన్‌కి చెందిన 40 మంది సైనికులు ఛిద్రమైపోయారు. ఆ రోజున భారత సైనికుల తరలింపు సురక్షితం కాదని సుమారు పదకొండు నిఘా సంస్థలు హెచ్చరించినా, నివేదికలు ఇచ్చినా అదే రూట్‌లో ఎందుకు పంపించారు? ఎన్‌హెచ్44 భద్రతను ఎందుకు పెట్రోలింగ్ చేయలేదు? సుమారు పాకిస్తాన్ నుండి 300 కిలోల ఆర్‌డిఎక్స్‌ను తరలించి కాశ్మీరు రహదారులపైనా పది పదిహేను రోజుల పాటు తిరుగుతున్నా నిఘా సంస్థలు ఎందుకు పట్టుకోలేక పోయాయి? ఈ ప్రశ్నలన్నిటికి దేశ ప్రజలకు, అమరులైన జవానుల కుటుంబాలకు దేశ ప్రధాని, కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. అందరికంటే మేమే గొప్ప దేశభక్తులం అని చెప్పుకునే బిజెపి ప్రభుత్వ హయాంలో పుల్వామా దాడి ఒక్కటే కాదు కాశ్మీరు ఆధారిత ఉగ్రవాదులు ఇప్పటికీ మన సైన్యంపైన దాడులు చేస్తూనే ఉన్నారు. పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు స్మారకాలను నిర్మించి, వారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తాం, ఆర్థిక భరోసా ఇస్తాం అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన మోడీ...వారి త్యాగాలను గాలికి వదిలేయడాన్ని దేశప్రజలు గమనిస్తున్నారు. దీనిపైన సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉన్నది.

- డా॥ నలమాస శ్రీకాంత్ గౌడ్,
సెల్: 8886666006

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కాంగ్రెస్‌లోకి కర్ణాటక మాజీ సిఎం జగదీశ్ షెట్టర్

- బిజెపి కొందరి నియంత్రణలో ఉన్నదని ఆగ్రహం
- కమలం పార్టీకి భారీ ఎదురు దెబ్బ : రాజకీయ విశ్లేషకులు

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వేళ మాజీ సిఎం, బిజెపి సీనియర్ నాయకుడు జగదీశ్ షెట్టర్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఆ పార్టీలో చేరిన ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో పిసిసి చీఫ్ డి.కె శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కర్నాటక కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా పాల్గొన్నారు. ఇప్పటికే కర్ణాటకలో బిజెపిని పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు వీడారు. మరోపక్క, ఆ పార్టీకి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. కర్ణాటకలో బిజెపి ఎదుగుదలకు తోడ్పడిన జగదీశ్ షెట్టర్ సైతం ఆ పార్టీని వీడటం కోలుకోలేని దెబ్బగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణించారు. ఉత్తర కర్నాటకకు చెందిన లింగాయత్ నేతల్లో అత్యంత ప్రముఖుడైన షెట్టర్ కాంగ్రెస్‌లో చేరడం హస్తం పార్టీకి బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు.

కొందరు వ్యక్తుల నియంత్రణలో బిజెపి

కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా జగదీశ్ షెట్టర్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం బిజెపి కొందరి చేతిలో ఉన్నదనీ, వారి స్వార్థ ప్రయోజనాల కోసం పని చేస్తున్నారని అన్నారు. సీనియర్ నాయకుడినైన తనకు టికెట్ వస్తుందనని ఆశించాననీ, కనీసం తనకు మాట కూడా చెప్పకుండా టికెట్ తిరస్కరించడంతో షాక్‌కు గురయ్యానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను మనస్ఫూర్తిగానే కాంగ్రెస్‌లో చేరుతున్నానని షెట్టర్ తెలిపారు.

జగదీశ్ షెట్టర్ చేరిక కాంగ్రెస్‌లో మరింత ఉత్సాహాన్ని పెంచుతుందని పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. షెట్టర్ తాను గెలవడమే కాకుండా మరికొందరిని గెలిపించగల సామర్థ్యం ఉన్న నాయకుడు అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం కోసం ఆదివారం రాత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో హుబ్లీ నుంచి బెంగళూరుకు షెట్టర్ చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిక అనంతరం ఆయన సొంత నియోజకవర్గంలో పోటీ చేసేందుకు బీ ఫామ్‌ను కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. అనంతరం సొంత నియోజకవర్గానికి చేరుకున్న జగదీశ్ షెట్టర్‌కు ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు ఆయన చెప్పారు.

కెజిఎఫ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థి పి థంగరాజ్ నామినేషన్

బెంగళూరు : కర్ణాటకలోని కెజిఎఫ్ నియోజక వర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా పి. థంగరాజ్ నామినేషన్ దాఖలు చేశారు. మే 10న జరిగే అసెంబ్లీలో ఎన్నికలకు నాలుగు స్థానాల నుంచి సిపిఎం పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. కెజిఎఫ్ నియోజకవర్గంలో సిపిఎంకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. 1952 తొలి ఎన్నికల్లో అవిభక్త సిపిఐ ఈ స్థానంలో విజయకేతనం ఎగుర వేసింది. తరువాత 1957, 1962 ఎన్నికల్లోనూ తన స్థానాన్ని నిలుపుకుంది. సిపిఎం ఏర్పాటు తరువాత 1985లో ఇక్కడ నుంచి సిపిఎం అభ్యర్థి టిఎస్ మణి ఘన విజయం సాధించారు. 1983, 1989 ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారు. ప్రస్తుత అభ్యర్థి థంగరాజ్ ఇక్కడ 2008 ఎన్నికల నుంచి బరిలో ఉన్నారు. థంగరాజ్ యువజన ఉద్యమంలో కీలకంగా ఉండటంతో పాటు, కోలార్ జిల్లా కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

యుపిలో ఘోరం

దళిత విద్యార్థిని కాల్చివేత

లక్నో: బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో కాల్పుల హత్యలు కొనసాగుతున్నాయి. తాజాగా దళిత విద్యార్థినిని ఇద్దరు వ్యక్తులు తుపాకితో కాల్చి చంపారు. ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్ జిల్లాలో పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఈ సంఘటన జరిగింది. 21 ఏళ్ల రోష్ని అహిర్వార్, బిఎ రెండో ఏడాది చదువుతోంది. సోమవారం ఉదయం జలౌన్‌లోని రామ్ లఖన్ పటేల్ మహావిద్యాలయానికి వెళ్లి పరీక్ష రాసింది. అనంతరం ఉదయం 11 గంటలకు కాలేజీ నుంచి ఇంటికి తిరిగి వస్తున్నది. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఆమె వద్దకు వచ్చారు. ఒక వ్యక్తి దేశీయ తుపాకీతో రోష్నీ తలపై కాల్పులు జరిపాడు. దీంతో ఆమె రక్తం మడుగుల్లో పడి అక్కడికక్కడే చనిపోయింది. రోడ్డుపై ఉన్న వారు ఈ సంఘటన చూసి షాక్ అయ్యారు. విద్యార్థిని రోష్నిపై గన్‌తో కాల్పులు జరిపిన వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. నిందితులు తుపాకీని వారి మీదకు విసిరి అక్కడి నుంచి పారిపోయారు.

'పట్టణ ఉన్నత వర్గాల అభిప్రాయమే !

స్వలింగ వివాహాలపై సుప్రీంలో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ : స్వలింగ వివాహానికి చట్టపరమైన గుర్తింపు కావాలని చేస్తున్న డిమాండ్ కేవలం "పట్టణ ఉన్నత వర్గాల అభిప్రాయమే"నని కేంద్రం సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. సామాజిక ఆమోదం కోసమే ఇలాంటి డిమాండ్లు తలెత్తుతున్నాయని పేర్కొంది. స్వలింగ వివాహాలను ధ్రువీకరించడం ద్వారా కొత్త సామాజిక వ్యవస్థను న్యాయపరంగా సృష్టించడానికి కోర్టు ప్రయత్నించరాదని పేర్కొంది. న్యాయమూర్తులు ఈ విషయాన్ని పార్లమెంట్‌కు వదిలివేయాలని కోరింది. సిజెఐ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలో రాజ్యాంగ ధర్మాసనం ముందు స్వలింగ వివాహాల కేసు విచారణకు వచ్చిన సందర్భంలో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.

మైనారిటీ కమిషన్ల ఏర్పాటులో అలసత్వం

న్యూఢిల్లీ : మైనారిటీ కమిషన్ల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. పది రాష్ట్రాలు, జమ్ముకాశ్మీర్ సహా ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలలో ఇప్పటివరకూ మైనారిటీ కమిషన్లు ఏర్పాటు కాలేదు. కమిషన్ల ఏర్పాటుపై జాతీయ మైనారిటీల కమిషన్ ఛైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పురా ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పలు దఫాలుగా లేఖలు రాశారు. ఇప్పటి వరకూ 17 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతం మాత్రమే మైనారిటీ కమిషన్లను ఏర్పాటు చేశాయి. కొన్ని రాష్ట్రాల్లో కమిషన్లు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమేనని అధికారులు తెలిపారు.

దళితుల భూముల్లో అక్రమ తవ్వకాలను నిలువరించండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో దళిత పేద కుటుంబాలకు చెందిన లంక భూముల్లో అక్రమ తవ్వకాలను నిలువరించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి క్రాంతి కుమార్, పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు, డి ఫారం పట్టా లంక భూముల డెవలప్‌మెంటు సొసైటీ అధ్యక్షులు గొల్లా ఏడుకొండలు, సొసైటీ సభ్యులు కానేటి బాల తదితరులు రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చించినాడ గ్రామంలో ఎస్‌సి, బిసిలకు 1983లో 60 ఎకరాలకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఆ భూములే ఆ కుటుంబాలకు జీవనాధారంగా వున్నాయని తెలిపారు. ఆక్వా సాగు కూడా చేసుకుంటున్నారన్నారు. అలాంటి భూముల్లో గ్రామంలోని పెత్తందారులు దౌర్జన్యంగా, అక్రమంగా మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. పదెకరాల భూమి సాగుకు నోచుకోని రీతిలో తవ్వకాలు చేశారని తెలిపారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, హైకోర్టుకు వెళ్లి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని ఉత్తర్వులను తెచ్చినా ఏమాత్రం లెక్కచేయకుండా అలాగే తవ్వకాలు చేస్తున్నారన్నారు. తక్షణమే మట్టి తవ్వకాలను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలి

- వడదెబ్బ మరణాలపై ప్రతిపక్షాల ఆగ్రహం
- 13కు పెరిగిన అమిత్‌షా సభ మృతులు

ముంబయి : మహారాష్ట్ర భూషణ్ 2022 అవార్డు ప్రధానోత్సవంలో వడదెబ్బతో మరణించిన వారి సంఖ్య 13కు చేరడంతో బిజెపి-శివసేన కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహణలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని బిజెపి-శివసేన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రభుత్వంపై హత్య నేరం కింద కేసు నమోదు చేయాలని మహా వికాస్ అఘాడి డిమాండ్ చేసింది. మహారాష్ట్ర భూషణ్-2022 అవార్డుల ప్రదానోత్సవ సందర్భంగా నీడ లేకుండా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరై మరణించిన వారి సంఖ్య సోమవారం నాటికి 13కి పెరిగింది. సుమారు 600 మంది వడదెబ్బకు గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 18 మంది పరిస్థితి విషమంగా ఉంది. మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన నవీ ముంబయిలో ఆదివారం మహారాష్ట్ర భూషణ్-2022 అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఎం ఏక్‌నాథ్ షిండేతోపాటు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బిజెపి కూటమి ప్రభుత్వం బల ప్రదర్శన కోసం భారీగా జనాన్ని సమీకరించింది. మిట్ట మధ్యాహ్నం కార్యక్రమం నిర్వహించడంతోపాటు, నీడ కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో కార్యక్రమానికి హాజరైన సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కేవలం రెండు టెంట్లను ఏర్పాటు చేసి, విఐపిలకు కేటాయించారు. ఆరు గంటల పాటు కార్యక్రమం సాగింది. అధిక ఉష్ణోగ్రత, వేడి భరించలేక వందలాదిమంది వడదెబ్బకు గురయ్యారు. సరైన ఏర్పాట్లు చేయకుండా సభ నిర్వహించి, ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమవడంపై ప్రతిపక్షాలతోపాటు బాధితుల కుటుంబ సభ్యులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నవీ ముంబయిలో కమోథేలోని ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడదెబ్బ బాధితుల్ని ప్రతిపక్ష నేతలు అజిత్ పవార్ (ఎన్‌సిపి), ఉద్ధవ్ థాక్రే (శివసేన-యుబిటి) తమ ఎమ్మెల్యేలతో కలిసి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'ఈ ప్రాంతంలో ఏప్రిల్-మేల్లో అత్యధిక ఉష్ణోగ్రత ఉంటుందని అందరికీ తెలుసు. అయినా మిట్ట మధ్యాహ్నం ఈ కార్యక్రమాన్ని షెడ్యూల్ చేసిన వారిని విచారించాల్సిన అవసరం ఉంది' అని అజిత్ పవార్ పేర్కొన్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు నానా పటోల్ స్పందిస్తూ .. ఈ కార్యక్రమం నిర్వహణలో ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యహరించిందని, ప్రభుత్వంపై హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఒబిసిల సంక్షేమం విస్మరించిన మోడీ : రాహుల్ గాంధీ

బెంగళూర్ : ఒబిసిలకు నరేంద్ర మోడీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం చేసింది శూన్యమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఒబిసిలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలంటే ముందుగా వారి హక్కులను వారికి అందించాలని, ఒబిసి జనాభా గణాంకాలను ప్రధాని వెల్లడించాలని కోరారు. ప్రధాని ఎన్నడూ ఈ పని చేయరని, ఎందుకంటే ఆయనకు ఒబిసిల సంక్షేమం పట్టదని దుయ్యబట్టారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం బీదర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. కర్ణాటకలో ప్రస్తుత బిజెపి సర్కార్‌ను 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని ప్రజలే వ్యవహరిస్తున్నారని, ఈ పదాన్ని కాంగ్రెస్ పార్టీ వాడలేదని రాహుల్ పేర్కొన్నారు. అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపి కాంగ్రెస్‌కు పాలనా పగ్గాలు అందించాలని ఓటర్లకు పిలుపు ఇచ్చారు.

అతిక్ అహ్మద్ హత్య కేసు విచారణకు సిట్

లక్నో : గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపి అతిక్ అహ్మద్, అతని సోదరుడు ఖలీద్ అజీమ్ అలియాస్ అష్రఫ్ హత్య కేసును విచారించడానికి ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసినట్లు ఉత్తరప్రదేశ్ పోలీసులు సోమవారం తెలిపారు. ప్రయాగ్ రాజ్ పోలీస్ కమిషనర్ రామిత్ శర్మ ఆదేశాల మేరకు ఈ సిట్‌ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రత్యేక డిజిపి (శాంతిభద్రతలు) ప్రశాంత్ కుమార్ చెప్పారు. పోలీస్ కస్టడీలోని అతిక్, అష్రఫ్‌లను వైద్య పరీక్షల కోసం బయటకు తీసుకుని రాగా శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు అతి సమీపం నుంచి కాల్చి చంపిన సంగతి తెలిసిందే.

క్రిస్మస్ వరకు సమ్మె

- హెచ్చరించిన ఇంగ్లండ్ నర్సులు
- 30 నుండి 48గంటల పాటు విధుల బహిష్కరణ

లండన్ : ద్రవ్యోల్బణం కంటే తక్కువ స్థాయిలో వేతనాలు చెల్లిస్తామన్న వైఖరిని మార్చుకునేందుకు టోరీ మంత్రులు తిరస్కరించిన పక్షంలో క్రిస్మస్ వరకు సమ్మె కొనసాగిస్తామని బ్రిటన్‌కు చెందిన నర్సులు సోమవారం హెచ్చరించారు ఇప్పటికే పొదుపు చర్యలతో ఎన్‌హెచ్‌ఎస్ కార్యక్రమం దెబ్బతినిపోయింది.. మున్ముందు మరిన్ని వాకౌట్‌లు జరగకుండా ఉండాలంటే మెరుగైన వేతన ఒప్పందం కావాలని రాయల్ కాలేజి ఆఫ్ నర్సింగ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పాట్ కులెన్ డిమాండ్ చేశారు. ఒకవేళ అత్యవసర పరిస్థితులు తలెత్తిన పక్షంలో నర్సులు పికెట్ ప్రాంతాల నుండి వచ్చి సేవలందిస్తారని యూనియన్ హామీ ఇచ్చింది. ఏప్రిల్ 30న రాత్రి 8గంటల నుండి 48గంటల పాటు తమ సభ్యులు విధులను బహిష్కరిస్తారని ఆర్‌సిఎన్ శుక్రవారం ప్రకటించింది. 54శాతం మంది సభ్యులు ఆర్‌సిఎన్ యూనియన్ నాయకత్వాన్ని ధిక్కరించి, 2022-23 సంవత్సరానికి నగదు చెల్లింపును, ఈ ఏడాదికి 5శాతం పెంపును వ్యతిరేకిస్తూ ఓటు వేశారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ ఆందోళనలో

మొదటిసారిగా అన్ని విభాగాల వారూ పాల్గొంటున్నారు. గతేడాది డిసెంబరులో ఈ వివాదం ప్రారంభమైంది. ఈ 48గంటల సమ్మె విజయవంతంగా ముగిసినతర్వాత తమ సభ్యులకు ఓటింగ్ నిర్వహిస్తామని, అది విజయవంతమైతే క్రిస్మస్ వరకు తదుపరి సమ్మె కార్యాచరణ కొనసాగుతుందని పాట్ కులెన్ ప్రకటించారు.

సూడాన్‌లో మూడో రోజూ ఘర్షణలు

- 97కి పెరిగిన పౌర మరణాలు
- కాల్పులను తక్షణమే విరమించాలని సూడాన్ కమ్యూనిస్టుల పిలుపు

ఖార్టూమ్ : సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లో మూడవ రోజూ హింస కొనసాగింది. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 97 మంది పౌరులు మరణించారు. 600 మందికిపైగా గాయపడ్డారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లరాదని, ఇంటిపట్టునే వుండాలని అక్కడి భారతీయులను భారత దౌత్య కార్యాలయం హెచ్చరించింది. తక్షణమే కాల్పులను విరమించి, సాధారణ పరిస్థితిని పునరుద్ధరించాలని సూడాన్ కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. సూడాన్ సైన్యం, ప్రత్యర్థుల మధ్య చెలరేగిన ఘర్షణలతో రాజధాని ఖర్తూమ్ అట్టుడుకుతోంది. బుల్లెట్ గాయాలతో ఆదివారం భారతీయుడొకరు మరణించడం పట్ల మన విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఖార్టూమ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఆ దేశంలో సంభవిస్తున్న పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సూడాన్ సైన్యం, పారా మిలటరీ బలగాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో ఖార్టూమ్‌లోని వివిధ ప్రాంతాల్లో పేలుళ్ళు, ఘర్షణలు చెలరేగుతున్నాయి. సూడాన్‌లో దాదాపు 4వేల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో దాదాపు 1200మంది దశాబ్దాల క్రితమే ఆ దేశంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. 2021 అక్టోబరులో కుట్ర ద్వారా సూడాన్ మిలటరీ అధికారాన్ని చేజిక్కించుకుంది.

తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని సూడాన్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌సిపి) విజ్ఞప్తి చేసింది. ఈ ఘర్షణలు, హింసాకాండలో బాధితులంతా సామాన్యులని, విప్లవ సాధనకు, ప్రజాస్వామ్య పౌర పాలన కోసం కృషి చేస్తున్న వారేనని ఎస్‌సిపి పేర్కొంది. నగరాలు, గ్రామాల నుండి సైనికులు, ఉగ్రవాదులు వైదొలగాలని, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పౌర సమావేశాలకు వారిని దూరంగా వుంచాలని కోరింది. అధికారం, సంపద కోసం కొన్ని విదేశీ శక్తులు ప్రోత్సహించిన ఘర్షణలే ఇవి అని పేర్కొంది. ఈ పరిస్థితుల గురించి తాము ఎప్పటి నుండో హెచ్చరిస్తూనే ఉన్నామని ఈ ఘర్షణలు ప్రజల్లో భయాందోళనలు, అయోమయం వ్యాపింప చేస్తున్నాయని పార్టీ పేర్కొంది. మన ప్రజలు, దేశభక్తియుత శక్తులు, రాడికల్ మార్పుల కోసం పోరాడే శక్తులన్నీ సమైక్యంగా వుండడమే ప్రస్తుత సంక్షోభ పరిష్కారానికి ప్రాతిపదిక అని పేర్కొంది.

ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆందోళన

సూడాన్ సైన్యం, పేరా మిలటరీ బలగాల మధ్య కొనసాగుతున్న ఘర్షణలపై ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల మరణాలు, పెద్ద సంఖ్యలో గాయపడేందుకు కారణమైన ఘర్షణలను గుటెరస్ తీవ్రంగా ఖండించారని ఆయన ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతి చెందిన వారిలో ప్రపంచ ఆహార కార్యక్రమానికి చెందిన వారు ముగ్గురు వుండగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఉద్రిక్తతలకు కారణమైన వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆ ప్రకటన కోరింది. తక్షణమే ఘర్షణలను విరమించి, చర్చల ద్వారా ప్రశాంత పరిస్థితులు నెలకొనేలా చూడాల్సిందిగా గుటెరస్ ఉభయ పక్షాలను కోరారు.

వాణిజ్య అసమానతలను పరిష్కరించుకోవాలి

రష్యా డిప్యూటీ ప్రధాని

న్యూఢిల్లీ : రష్యా, భారత్‌ల మధ్య గల వాణిజ్య అసమానతలను పరిష్కరించుకోవాల్సిన అవసరం వుందని రష్యా డిప్యూటీ ప్రధాని, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి డెనిస్ వలెంతినోవిచ్ సోమవారం పేర్కొన్నారు. భారత్ నుండి ఎగుమతులు మెరుగుపడాల్సి వుందన్నారు. పశ్చిమ దేశాల స్థానే భారత్ నుండి యంత్రాలతో సహా తయారీ పరికరాల దిగుమతి చేసుకోవడానికి ఆసక్తిగా వున్నామని చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యతో మాస్కోపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 24వ రష్యా-భారత్ అంతర ప్రభుత్వ కమిషన్ (ఐజిసి) సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని ఈ సమావేశంలో సమీక్షిస్తారని భావిస్తున్నారు.

అడవుల పెంపకానికి చర్యలు

- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అడవులను సంరక్షించడంతోపాటు కంపెన్సేటరీ అఫారెస్టేషన్ కింద కొత్తగా అడవుల పెంపకానికి తగిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కాంపా) సమావేశం సిఎస్ అధ్యక్షతన సచివాలయంలో సోమవారం జరిగింది. కాంపా కింద 2022-23లో రూ.225 కోట్ల అంచనాతో అటవీకరణకు చర్యలు తీసుకున్నట్లు సిఎస్ చెప్పారు. పరిశ్రమలు, డ్యామ్‌లు, వివిధ ప్రాజెక్టుల నిర్మాణం, గనుల తవ్వకం, అటవీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి అటవీ భూములను వినియోగించిన ప్రాంతాల్లో పెద్దఎత్తున అడవులను చేపట్టడమే కాంపా ముఖ్య లక్ష్యమని తెలిపారు. అటవీ భూములను వినియోగించిన చోట పెద్దఎత్తున అటవీకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ సంరక్షణతోపాటు అడవుల్లో తెగుళ్ళు, అగ్ని ప్రమాదాల నివారణ, భూసార పరిరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

గుంతకల్ డివిజన్ పై ఏటివిఎంల ద్వారా రిజర్వుకాని టికెట్లను జారీచేయుట కొరకు, ఫెసిలిటేటర్స్‌గా నియామకం కొరకు
ప్రకటన నం. 01/2023 (ఏటివిఎంలు), తేది: 17.04.2023.
PUB/0387

భారత రాష్ట్రపతి తరపున. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్ డివిజన్, గుంతకల్ వారు, గుంతకల్ డివిజన్ పై 12 రైల్వే స్టేషన్ల వద్ద ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్స్ (ఏటివిఎంలు) ద్వారా రిజర్వుకాని టికెట్లను జారీచేయుటకు మరియు యుటిఎస్ టికెట్లు పొందుట కొరకు స్మార్ట్ కార్డులు కలిగియున్న ప్రయాణీకులకు ఫెసిలిటేటర్స్‌గా నియామకం కొరకు దక్షిణ మధ్య రైల్వే యొక్క రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ నుండి దరఖాస్తులను కోరుచున్నారు. ఫెసిలిటేటర్స్‌గా పనిచేయుటకు 31.03.2024 వరకు అనుమతి ఉంటుంది. ఏటివిఎం స్మార్ట్ కార్డుల ద్వారా టికెట్స్ డిస్పెండింగ్ పై ఏదైతే 3% (తేదీనాటికి) బోనస్ మొత్తాలు మినహా, ఫెసిలిటేటర్‌గా పనిచేయుటకు రైల్వే ఏదేని వేతనం ఇవ్వదు,
గుంతకల్ డివిజన్ పై ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్స్ (ఏటివిఎంలు) కొరకు సదుపాయం కలిగియున్న ఏటివిఎం ఫెసిలిటేటర్స్ కొరకు కావలసిన స్టేషన్ల జాబితాలు దిగువ విధంగా ఉన్నవి:

క్ర సం	స్టేషన్ క్యాటగరీ	ఏటివిఎం లొకేషన్	లొకేషన్ వద్ద కావలసిన ఫెసిలిటేటర్స్ సంఖ్య
1	NSG-3	HX	2
2	NSG-3	ATP	1
3	NSG-3	GTL	1
4	NSG-3	YG	2
5	NSG-3	RC	2
6	NSG-4	DMM	1
7	NSG-4	CTO	2
8	NSG-4	AD	1
9	NSG-4	MALM	2
10	NSG-5	RJP	2
11	NSG-5	TU	1
12	NSG-6	MPL	1
	మొత్తం		18

ఈ ఆఫీసు నుండి దరఖాస్తు ఫారాలు జారీచేయుట కొరకు తేది: 19.04.2023న 10:00గం.ల నుండి.
ఈ ఆఫీసు నుండి దరఖాస్తు ఫారాలు జారీచేయుట కొరకు చివరి తేది: 12.05.2023న 12:00గం.ల వరకు.
దరఖాస్తు ఫారాలు స్వీకరించుట కొరకు చివరి తేది: 12.05.2023న 15:00గం.ల వరకు.
టెండర్లు/ దరఖాస్తు ఫారాలు తెరుచు తేది: 12.05.2023న 16:00గం.లు

ఆసక్తిగల రిటైర్డ్ ఎంప్లాయిస్ నిర్ణీత ఫార్మేట్ లో వారి దరఖాస్తు ఫారాలను 12.05.2023న 15:00గం.లకు ముందుగా సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ ఆఫీసు, గుంతకల్ వద్ద దాఖలుచేయవలెను. నిర్ణీత దరఖాస్తు ఫారం, నియమాలు& నిబంధనలు, స్కీమ్ యొక్క ముఖ్య అంశాలు మొ॥నవి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్ వారి కార్యాలయంలో, అదే విధంగా రైల్వే అధికార వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in లో పేర్కొనబడినవి.

A0537 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	శివెన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, లీల ప్రియాంక మరియు మహీధర్ పసం/డో.నం.1-75 డిఎ 105 ఫ్లాట్ నం.105 గ్రౌండ్ ఫ్లోర్ డి జిహెచ్ఎమ్‌సి ఎస్‌వై.నం.45/1 పి.గచ్చిబౌలి గ్రామం, శేర్లింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500032/ 068005003336.	తెలంగాణా రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, జిహెచ్ఎమ్‌సి శేర్లింగంపల్లి సర్కిల్ క్రింద, శేర్లింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామం, జిహెచ్ఎమ్‌సి డో.నం.1 75 డిఎ 105 ఫ్లాట్ నం.105 గ్రౌండ్ ఫ్లోర్ డి చిరునామా ఎస్‌వై.నం.45/1 పి టిఐఎన్ నం.1209954758, తూర్పు: కట్ ఔట్ మరియు ఫ్లాట్ నం.106, పడమర: కారిడార్ మరియు ఫ్లాట్ నం.104, ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: కట్ ఔట్ మరియు ఫ్లాట్ నం.102. తో కలిసి అన్నీ భవనములు మరియు నిర్మాణాలు అందులో ఫిక్చర్స్, ఫిట్టింగ్స్ మరియు అన్నీ ప్లాంట్ మరియు యంత్రాలు భూమికి జోడించబడి ఉంటాయి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిషత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి. లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 13 ఏప్రిల్ 2023	21-12-2022 Rs. 36,81,203.00/-	హైదరాబాద్, గుంటూరు మరియు నెల్లూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.
తేది : 18 ఏప్రిల్, 2023
ప్రదేశం : గుంటూరు
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	కసరనేని శ్రీ లక్ష్మి/కసరనేని నవీన్/ LBGTR00004745945	ఆస్తి షెడ్యూల్ -ఎ : ఎ.పి., గుంటూరు జిల్లా, మంగళగిరి మున్సిపాలిటీ వద్ద ఉన్న మొత్తం ఆ ఓపెన్ స్థలం డో.నం.66 లో కొలిచే 4932.43 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు: ఉత్తరం: 40' వెడల్పు రోడ్డు, దక్షిణం: శ్రీ. దామర్ల నరసింహ స్వామి యొక్క స్థలం, తూర్పు: శ్రీ. సూర్యదేవర నాగార్జున యొక్క స్థలం, పడమర: శ్రీ బాలాజీ ఫార్చ్యూన్ టవర్స్. ఆస్తి షెడ్యూల్-బి: గుంటూరు జిల్లా, మంగళగిరి మున్సిపాలిటీ, మంగళగిరి వద్ద ఉన్న "లక్ష్మి శ్రీ లిఖిత ఫ్రైడ్" యొక్క 4వ అంతస్తు (పర్మిషన్ ప్లాన్ ప్రకారం 3వ అంతస్తు) లో నార్త్ బ్లాక్ యొక్క మొత్తం ఆ రెసిడెన్షియల్ ఫ్లాట్ బేరింగ్ నం.404. ఓపెన్ స్థలం డో.నం.66 లో కొలిచే 4932.43 చ.గ.లు., బిల్డప్ ఏరియా 1465 చ.అ.లు. తో పాటు కామన్ ఏరియాలు, స్టిల్ట్ ఫ్లోర్ లో ఒక కార్ పార్కింగ్ స్లాట్ కొలిచే 100 చ.అ.లు. మరియు స్థలం యొక్క అవిభక్త వాటా కొలిచే 62.91 చ.గ.లు. డో.నం.66 లో బయటకు 4932.43 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు: ఉత్తరం: డక్ట్ మరియు ఫ్లాట్ నం.405, దక్షిణం: డక్ట్ మరియు ఫ్లాట్ నం.403, తూర్పు: కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై. లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 12.04.2023	29.12.2022/ Rs. 23,15,673.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.
తేది : 18 ఏప్రిల్, 2023
ప్రదేశం : గుంటూరు.
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

మీ కోసం

స్టీలు వాటర్ బాటిళ్లు వాసన పోవాలంటే ఒక చెంచా నిమ్మరసం, అరచెంచా బేకింగ్ సోడా, కాసిన్ని నీళ్ళు అందులో పోసి బాగా గిలకొట్టాలి. ఓ పది నిమిషాల తరువాత మంచి నీళ్లతో బాటిల్ కడిగితే వాసన పోతుంది. మరకలు ఉన్నా పోతాయి.

జీవన సౌరభం

అందరినీ తన వెంట తిప్పకునేవాడు నాయకుడు అవ్వడు.. అందరితో కలిసి నడిచేవాడే నిజమైన నాయకుడు.

నేనెవరిని?



ఉన్నట్టుండి నాకో అనుమానమొచ్చింది
నేనెవరిని అని?
మబ్బు అంది నువ్వు నా ' ముద్దుగుమ్మ' వని
ముచ్చటేసింది ముద్దులొలికే ఆ మాట విని

చందమామ అంది నువ్వు నా 'చక్కని చుక్క' వని
చక్కిలిగింతలు పెట్టినట్టనిపించింది ఆ చమక్కు విని

అమ్మ అంది నువ్వు నా 'అందాల భరిణ' వని
ఆనందపారవశ్యమయింది నా మనసు ఆ పిలుపు విని

నాన్న అన్నాడు నువ్వు నా 'నెలవంక' వని
నెమలిలా నాట్యమాడింది నా మనసు ఆ మాట విని

మామయ్య అన్నాడు నువ్వు నా 'ముద్దుల మూట' వని
మీగడ తినినట్టనిపించింది మురిపించే ఆ మాట విని

అన్నయ్య అన్నాడు నువ్వు నా 'అపురూపమైన చెల్లి' వని
ఆనంద డోలికల్లో తేలియాడింది అబ్బురమైన ఆ మాట
విని

బాబాయి అన్నాడు నువ్వు నా 'బంగారు బొమ్మ'వని
బలమెంతో వచ్చింది నాకు ఆ మాటను విని

నెచ్చెలి అంది నువ్వు నా 'తోడూనీడ'వని
నింగికి ఎగిరినట్టనిపించింది నా నెచ్చెలి మాట విని

తాతయ్య అన్నాడు నువ్వు మా 'అందరి వెలుగు'వని
తెలిసివచ్చింది నేనెవరినో, తనువంతా పులకించింది

– కొమ్ముల వెంకట సూర్యనారాయణ
99496 02721

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ



– కె. హేమేంద్ర,
4వ తరగతి,
సెయింటాన్స్ స్కూలు,
తిరువూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వడదెబ్బ తగలకుండా ..

ఎండలో ఎలాంటి రక్షణ లేకుండా తిరిగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదముంది. ఎండలో తిరిగితేనే వడదెబ్బ తగులుతుందని లేదు, మన శరీరంలో నియంత్రణ వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు ఇంట్లో కూర్చున్నా వడదెబ్బ తగులుతుంది. దీనివల్ల శరీరం ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి, ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉంటుంది. కొన్నిసార్లు ప్రాణం పోయే ప్రమాదం కూడా ఉంటుంది.

వడదెబ్బ లక్షణాలు

- శరీరం నుంచి చెమట రావడం నిలిచిపోతుంది. నాడి వేగంగా కొట్టుకుంటుంది. శరీరం, మెదడు స్వాధీనంలో ఉండవు. సకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. మిగతా అన్ని జబ్బులను నయం చేసుకోడానికి కొంత వ్యవధి ఉంటుంది. కానీ వడదెబ్బ విషయంలో ప్రాణాపాయం జరగడమన్నది ఒక్కోసారి కొన్ని క్షణాలు, కొన్ని నిమిషాల్లో జరిగిపోవచ్చు.
- చర్మం పొడిబారిపోవడం కూడా వడదెబ్బ లక్షణమే. శరీరంలో నీటి పరిమాణం పడిపోయిందని చెప్పే సూచన ఇది. అయితే వడదెబ్బ నుంచి కాస్త కోలుకున్నామని అనిపించినా వెంటనే మళ్లీ ఎండలోకి వెళ్లొద్దు.

రిస్క్ ఎవరికి ఎక్కువ..

ఐదేళ్ల లోపు, 60 సంవత్సరాలు పైబడిన వారు త్వరగా ఎండదెబ్బకు గురవుతారు. అదే విధంగా గర్భిణీలు, బాలింతలు శరీరంలోని తేమ శాతాన్ని కాపాడుకుంటూ ఉండాలి. క్రీడాకారులు, స్థూలకాయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, ఆరు బయట వ్యాయామం చేసేవారికి రిస్క్ ఎక్కువ. మద్యం తీసుకునేవాళ్లు, మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డవాళ్లు, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడే వారు. పొడి చర్మం, వేడి చర్మం ఉన్న వాళ్లు, స్వేద రంధ్రాలు తక్కు వగా ఉండే వాళ్లకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.

దారి తీసే లక్షణాలు

వడదెబ్బ ప్రభావం ముందుగా శరీరంపై పడుతుంది. అధికంగా ఎండలో తిరగటంతో శరీరం మీది రక్త కణాలు కుంచించుకుపోతాయి. అనంతరం ఈ ప్రభావం కిడ్నీలు, లివర్ దెబ్బతినడానికి దారి తీస్తుంది. శరీరంలోని నీటి సమతుల్యతను కాపాడుకోవడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం వంటి చిన్నపాటి జాగ్రత్తలతో వడదెబ్బను అధిగమించవచ్చు. వడదెబ్బ తగిలిన రోజంతా విశ్రాంతి తీసుకుంటేనే శరీర వ్యవస్థ మళ్లీ సాధారణ స్థితికి వస్తుంది. ఈ లక్షణాలు కనబడితే వెంటనే వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని ప్రదేశంలోకి తరలించాలి. శరీరాన్ని చల్లటి నీళ్లతో లేదా ఐస్‌తో తుడవాలి. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి.

ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వారిని నీడలో ఉంచాలి. బట్టలు వదులు చేసి(25–30 డిగ్రీల)నీళ్లతో తడపాలి, ఈ విధంగా చేయటంతో రక్తనాళాలు కుంచించుకుపోకుండా ఆపే అవకాశం ఉంటుంది. గజ్జల్లో, చంకల్లో, మెడ వద్ద ఐస్ ప్యాక్ లు పెట్టాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.



జాగ్రత్తలు..

- వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి.
- తరచూ నీళ్లు తాగుతుండాలి.
- కళ్లకు కూలింగ్ గ్లాసెస్ పెట్టుకోవాలి. టోపీలు, స్కార్ఫ్‌లు వాడితే మంచిది. అలాగే బయటకి వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్ ఎప్పుడూ దగ్గర ఉంచుకోవాలి.
- మధ్యాహ్నం 12 గంటల నుండి ఐదు గంటల వరకు ఎండలో తిరగకపోవటం ఉత్తమం.
- ప్రతి అర్ధగంటకు మూడు వందల మిల్లీ లీటర్ల చొప్పున రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి.
- ఓ.ఆర్.ఎస్ నీళ్ళు, కొబ్బరికాయ, గ్లూ కోజ్ నీరు తీసుకోవటం మంచిది.
- నూనె పదార్థాల వాడకం తగ్గించాలి.
- పండ్లు ఎక్కువగా తీసుకోవాలి, పళ్లరసాలు తాగుతుండాలి.
- శరీరం లవణాలను కోల్పోకుండా ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఉప్పు వేసిన ద్రవాలు ఇవ్వాలి. చెమటను గ్రహించే, చల్లగా ఉండే వదులైన కాటన్ దుస్తులు ధరించాలి.
- వేసవిలో శీతల పానీయాలు అంత మంచిది కాదు. వాటికి బదులు కొబ్బరి బోండాం, మజ్జిగ వంటివి తీసుకోవడం మంచిది. దీని వల్ల శరీరంలోని లవణాలు కోల్పోకుండా జాగ్రత్త పడొచ్చు.

బామ్మ చదువు.. భళా..

చదువుకు వయసు అడ్డంకి కాదని ఎన్నోసార్లు.. ఎంతోమంది రుజువు చేశారు. ఇప్పుడు మనం చెప్పుకుంటున్నది కూడా వారిలో ఒకరి గురించే.. ఆమె గురించి చెప్పాలంటే.. ముడతలు పడిన శరీరం, నిలబడి నడవలేక వంగి నడుస్తున్న వైనం.. నోట్లో పళ్ల లేవు, జుట్టంతా తెల్లని ముగ్గుబుట్ట.. ఇవన్నీ గుర్తుకు వస్తాయి. అయితే 'సంకల్పం గట్టిదైతే.. శరీరం సహకరించక పోతేనేం..' అన్నట్లుగా తాను మొదలుపెట్టిన పనిని విజయవంతంగా పూర్తి చేసింది బామ్మ. ఇటీవల కేరళ రాష్ట్ర అక్షరాస్యత కార్యక్రమంలో 108 ఏళ్ల ఈ బామ్మ విద్యనభ్యసించి మొదటి ర్యాంకు సాధించింది. రెండో తరగతికే చదువు ఆపేసిన ఆ బామ్మ పేరు కమల కన్ని. తమిళనాడు కుంభం స్వస్థలం.

1915లో కుంభంలో పుట్టి పెరిగిన కమలకన్ని రెండో తరగతికే చదువు ఆపేసి కేరళలో తన కుటుంబంతో పాటు యాలకుల తోటలో పనికి వెళ్లింది. ఒకటి, రెండు కాదు.. సుమారు 80 ఏళ్లుగా ఆ తోటలో కార్మికురాలిగా పనిచేస్తోంది. కొడుకులు, కూతుళ్లు.. మనవలు, మనవరాళ్లు.. మునిమనవలు ఇలా మూడు తరాల వారసులను చూసింది. అయితే జీవితంలో ఎన్నో ఆటుపోట్లను చూసిన ఈ బామ్మకు చదువంటే చాలా ఇష్టం. కాని పేదరికం, కుటుంబ బాధ్యతల మధ్య చదువుకోవాలనుకున్న కోరిక అలాగే ఉండిపోయింది.

దేశంలోనే అక్షరాస్యతలో ప్రథమ స్థానంలో ఉన్న కేరళ రాష్ట్ర ప్రభుత్వం తన రాష్ట్రంలో చదువుపై ఆసక్తి ఉన్న వయోవృద్ధుల కోసం 'సంపూర్ణమ్ శాస్త్ర' కార్యక్రమాన్ని ప్రారంభించింది. దాని గురించి తెలుసుకున్న ఈ బామ్మ వెంటనే అందులో తన పేరు దరఖాస్తు చేసుకుంది. క్లాసులు ప్రారంభమైనప్పటి నుండి చిన్నపిల్లలా మారిపోయి ఎంతో శ్రద్ధతో పాఠాలు వినేది. తమిళం, మలయాళం రెండు భాషలపై పట్టు సాధించేందుకు ఎంతో శ్రమించింది. రాయడం, చదవడం నేర్చుకుంది. 100 మార్కులకు గాను 97 మార్కులు సాధించి అందరికంటే ముందు వరుసలో నుంచొంది. ఈ వయసులో ఒకేసారి రెండు భాషలపై పట్టు సాధించిన బామ్మ పట్టుదలను చూసి అందరూ అభినందిస్తున్నారు.

'మా బామ్మ చాలా తెలివైనది. చురుకైనది. చదువు అంటే చాలా ఇష్టం. అందుకే ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశాం. నేర్చుకుంటుందనుకున్నాం గాని ఇలా అందరికంటే ముందు వరుసలో నిలబడి ఆశ్చర్యపరుస్తుందని అనుకోలేదు. ఇప్పుడు మాకు చాలా సంతోషంగా ఉంది. వచ్చే నెలలో మా బామ్మ 109వ పుట్టినరోజు ఉంది. దాన్ని చాలా ఘనంగా నిర్వహించాలని కుటుంబసభ్యులందరం నిశ్చయించుకున్నాం. అదే మా బామ్మకు మేము ఇచ్చే బహుమతి' అంటున్నాడు కమలకన్ని మునిమనమడు. తన చిరకాల కోరిక నెరవేర్చుకోవాలనుకున్న ఈ బామ్మ సంకల్పం ముందు ఆమె వయసు చిన్నబోయింది. భళే బామ్మ కదూ..

బిజెపి నేతల విద్వేషపూరిత ప్రసంగాలపై

సుప్రీం నోటీస్

సిపిఎం నేతలు బృందాకరత్, కెఎం తివారీ పిటిషన్‌పై జోక్యం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

తీవ్ర విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, బిజెపి ఎంపి పర్వేశ్ వర్మపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఢిల్లీ ప్రభుత్వంతోపాటు ప్రతివాదులందరికీ సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో స్పందన తెలియజేయాలని పేర్కొంది. 2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్లకు ముందు బిజెపి నేతలు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, ఎంపి పర్వేశ్ వర్మ తదితరులు చేసిన విద్వేషపూరిత ప్రసంగాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బృందాకరత్, కెఎం తివారీ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించిన జూన్ 2022 నాటి ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'దేశానికి ద్రోహం చేసిన వారిని కాల్చండి' అని అనురాగ్ ఠాకూర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యను జస్టిస్ కెఎం జోసెఫ్ హైలెట్ చేశారు. ఠాకూర్ చేసిన 'దేశ్ కే గద్దరోన్ కో గోలీ మారన్...' వ్యాఖ్యలకు సంబంధించి, జస్టిస్ జోసెఫ్ స్పందిస్తూ 'గద్దర్ అంటే దేశద్రోహి అని నేను నమ్ముతాను? ఇక్కడ గోలీ మారన్ మందుల ప్రిస్క్రిప్షన్ పరంగా కాదు, కచ్చితంగా' అని అన్నారు. తీవ్రమైన నేరం జరిగిందని పోలీసులు విశ్వసిస్తే కేసు పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ కెఎం జోసెఫ్ అన్నారు. లలితకుమారి కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో ఈ విషయం స్పష్టం చేసినట్లు గుర్తు చేశారు. కేసు దాఖలు చేసి ఉంటే ప్రాథమిక దర్యాప్తును ఏడు రోజుల్లోగా పూర్తి చేయాలని కూడా జస్టిస్ జోసెఫ్ సూచించారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందస్తు అనుమతి అవసరమని మేజిస్ట్రేట్ చేసిన తీర్మానం ప్రాథమికంగా తప్పు అని జస్టిస్ జోసెఫ్ అన్నారు. కేసు నమోదు చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఒ)కు రెండుసార్లు లేఖ రాశామని బృందాకరత్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ తెలిపారు. కేసు నమోదు చేసే ముందు ముందస్తు అనుమతి తీసుకోవాలన్న మేజిస్ట్రేట్ తీర్మానం తప్పు, విద్వేషపూరిత ప్రసంగాలు గుర్తిస్తే వెంటనే కేసు నమోదు చేయాలని సుప్రీంకోర్టు స్వయంగా ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. ప్రసంగాలు చేసిన రెండు, మూడు రోజుల్లోనే పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) నిరసనకారులపై ఒక వ్యక్తి కాల్పులు జరపడంతో 'గోలీ మారో' ప్రసంగం నిజమైన చర్యగా మారిందని, ఢిల్లీ హైకోర్టు కొలేటరల్ ప్రొసీడింగ్‌లో ప్రసంగాలపై ప్రతికూలంగా వ్యాఖ్యానించిందని సీనియర్ న్యాయ వాది వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు.. ఢిల్లీ పోలీసులతో సహా ప్రతివాదులందరినీ వివరణ తెలపాలని ఆదేశించింది.

26 సమస్యలను పరిష్కరించాలి

- సిఎస్‌తో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో 26 అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు సూర్యనారాయణ, ఆస్కార్‌రావు తదితరులు సిఎస్‌ను కోరారు. సోమవారం సాయంత్రం సిఎస్ జవహర్‌రెడ్డితో సమావేశమయ్యారు. డిఎ, రాష్ట్ర ప్రభుత్వ అలవెన్సుల సమస్య పరిష్కరించాలని కోరారు. 2018 నుండి 2019 వరకూ పెన్షనర్లకు ఫించన్లు బకాయిలు చెల్లించాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికీ మార్చి నెలలో జీతాలు ఇవ్వలేదని ఇవ్వాలని కోరారు. క్రమం తప్పకుండా జీతాలివ్వాలన్నారు. 2022 ఆర్‌పిఎస్‌లో సాధించిన సంపాదిత సెలవు వ్యత్యాసాల బకాయిలు చెల్లించాలని సిఎస్‌ను కోరారు. అలాగే జిల్లా హెడ్ క్వార్టర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల 16 శాతం హెచ్‌ఆర్‌ఎ చెల్లించాలని కోరారు. వేర్వేరు డిపార్టుమెంట్లలోని ఉద్యోగులకు గెజిటెడ్ హోదా ఇవ్వాలని కోరారు. గ్రేడ్–2 విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించాలని వారు సిఎస్‌ను కోరారు. దీనికి స్పందించిన సిఎస్ వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

'తంగలాన్' మేకింగ్ వీడియో విడుదల

నిజ జీవిత సంఘటనలని ఆధారం చేసుకొని విక్రమ్, పా రంజిత్ కాంబినేషనల్‌లో రాబోతోన్న సినిమా 'తంగలాన్'. ఈ సినిమాలో హక్కుల కోసం పోరాటం చేసే తంగలాన్ అనే ఒక కమ్యూనిటీకి చెందిన కథని అదే టైటిల్‌తో తెరపై చూపించబోతున్నారు. పీరియాడికల్ జోనర్‌లో ఈ సినిమా తెరకెక్కుతోంది. తాజాగా ఈ చిత్రం నుండి మేకింగ్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. సోమవారం విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా ఈ మేకింగ్ విజువల్స్‌ని రిలీజ్ చేసినట్లు తెలుస్తోంది. కోలార్ గోల్డ్ మైనింగ్ నేపథ్యంలో సాగే కథగా ఈ సినిమా ఉండబోతోంది అని సమాచారం. మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ మూవీకి సంగీతం అందిస్తూ ఉండగా ఏ కిషోర్ కుమార్ సినిమాటోగ్రాఫర్‌గా చేస్తున్నారు. తిరుపతి సమీప శేషాచలం అడవిలో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. స్టూడియో గ్రీన్ నీలమ్ ప్రొడక్షన్ సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నాయి.

'ఏజెంట్' మమ్ముట్టి లుక్



టాలీవుడ్ యువ హీరో అఖిల్ అక్కినేని నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏజెంట్'. మలయాళ నటుడు మమ్ముట్టి కీలక పాత్రలో నటిస్తున్నాడు. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మమ్ముట్టి లుక్ విడుదల చేశారు. ది డెవిల్‌గా యాక్షన్ మూడ్‌లో లెజెండరీ యాక్టర్ మమ్ముట్టి అంటూ విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకోంటుంది. మోడల్ సాక్షి వైద్య తొలిసారి హీరోయిన్‌గా మెరవబోతుంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. మురళీ శర్మ, పోసాని కృష్ణమురళి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏజెంట్ చిత్రానికి వక్కంతం వంశీ కథనందించారు. ఏప్రిల్ 28న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

శివాలెత్తిన కాన్వే, దూబే

బెంగళూరుపై ఎనిమిది పరుగుల తేడాతో చెన్నై గెలుపు

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరుతో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 8పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 226పరుగులు చేయగా.. ఛేదనలో బెంగళూరు జట్టు చివరి వరకూ పోరాడి 8వికెట్లు కోల్పోయి 218పరుగులే ఓటమి పాలైంది. దీంతో చెన్నై జట్టు ఈ సీజన్‌లో 3వ విజయాన్ని నమోదు చేసుకుంది.

తొలుత టాస్ గెలిచిన బెంగళూరు కెప్టెన్ డుప్లెసిస్ చెన్నైకి బ్యాటింగ్ అప్పగించాడు. చెన్నై ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్(3)ను అవుట్ చేసి సంబరాలు చేసుకున్నా.. ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. కాన్వే, రహానే కలిసి పోటాపోటీగా ఆడారు. వీరిద్దరూ కలిసి బెంగళూరు బౌలర్లను కనికరించలేదు. ఈ క్రమంలో 20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 37 పరుగులు చేసిన రహానే 90 పరుగుల వద్ద రెండో వికెట్‌గా వెనక్కి పంపారు. రహానేను అవుట్ చేసిన ఆనందం కూడా బెంగళూరుకు ఎంతోసేపు మిగల్లేదు. క్రీజులోకి వచ్చిన శివం దూబే, కాన్వే కలిసి బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ కలిసి ఎడాపెడా షాట్స్ కొట్టడంతో చెన్నై ఓ దశలో 250కు పైగా పరుగులు దాటడం ఖాయమనిపించింది. ప్రమాదకరంగా మారి సెంచరీ దిశగా దూసుకెళ్తున్న కాన్వేను హర్షల్ పటేల్ బౌల్డ్ చేశాడు. 45 బంతులు ఆడిన కాన్వే 6ఫోర్లు, 6 సిక్సర్లతో 83 పరుగులు చేశాడు. ఆ తర్వాత 8 పరుగులకే దూబే కూడా అవుట్ కావడంతో పరుగుల వేగం మందగించింది. 27 బంతులు ఎదుర్కొన్న దూబే 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52 పరుగులు చేశాడు. వీరిద్దరూ కలిసి 3వ వికెట్‌కు 80పరుగులు జతచేశారు. అంబటి రాయుడు 14, మెయిన్ అలీ 19(నాటౌట్) రవీంద్ర జడేజా 10 పరుగులు చేశారు. బెంగళూరు బౌలర్లలో సిరాజ్, పార్నెల్, వైశాఖ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, హసరంగ, హర్షల్ పటేల్ చెరో వికెట్ తీసుకున్నారు. ఛేదనలో తొలుత బెంగళూరు ఓపెనర్ కోహ్లి(6) నిరాశపరిచినా.. డుప్లెసిస్(62; 33బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్లు), మ్యాక్స్‌వెల్(76; 36బంతుల్లో 3ఫోర్లు, 8సిక్సర్లు) విధ్వంస ఇన్నింగ్స్ ఆడారు. దీంతో బెంగళూరు సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించినా.. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత ఆదుకొనే మరో బ్యాటర్ కరువయ్యాడు. దినేశ్ కార్తీక్(28), ప్రభుదేశ్(19) మెరిసినా ప్రయోజనం లేకపోయింది. దేశ్‌పాండేకు మూడు, పథిరణకు రెండు, ఆకాశ్, తీక్షణ, మొయిన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఐపిఎల్‌లో నేడు..
ముంబయి × హైదరాబాద్
(వేదిక: హైదరాబాద్; రా.7.30గం॥లకు)

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	+1.45
లక్నో	5	3	2	6	+0.76
చెన్నై	5	3	2	6	+0.26
గుజరాత్	5	3	2	6	+0.19
పంజాబ్	5	3	2	6	-0.10
కోల్‌కతా	5	2	3	4	+0.32
బెంగళూరు	5	2	3	4	-0.31
ముంబయి	4	2	2	4	-0.38
హైదరాబాద్	4	2	2	4	-0.82
ఢిల్లీ	5	0	5	0	-1.48

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

చెన్నైలో ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ

2008 తర్వాత ఇదే తొలిసారి

చెన్నై: ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ చెన్నై వేదికగా జరగనుంది. ఈ విషయాన్ని హాకీ ఇండియా(హెచ్ఐ) సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2008లో ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ చెన్నై వేదికగా జరిగింది. అప్పట్లో ప్రభుజ్యోతి సింగ్, రాజ్‌పాల్ సింగ్ మరియు శివేంద్రసింగ్ త్రయంలోని భారతజట్టు ఏడు మ్యాచుల్లో 55గోల్స్ చేసి ఫైనల్లో దక్షిణ కొరియాను 7–2గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ విజేతగా నిలిచింది. ఆ తర్వాత న్యూఢిల్లీ, ఒడిషాలకు మారింది. ఈసారి ఆతిథ్య భారత్‌తోపాటు జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, చైనా, పాకిస్తాన్‌లు బరిలోకి దిగనుండగా.. టోర్నీ ఆగస్టు 3నుంచి 13వరకు చెన్నైలోని మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో జరగనుంది.

శ్రీలంక భారీస్కోర్

గాలే: రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఐర్లాండ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక జట్టు తొలి 6వికెట్ల నష్టానికి 591పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. కెప్టెన్ కరుణరత్నే(179), కుశాల్ మెండీస్(140), ఛండీమాల్(102), సమరవిక్రమ(104) సెంచరీలతో కదం తొక్కారు. ఐర్లాండ్ బౌలర్లు క్యాంపెర్‌కు రెండు, మార్క్ అడైర్, మెక్‌బ్రినే, వైట్, డాక్నెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 7వికెట్ల నష్టానికి 117పరుగులు చేసింది. మెక్‌కొల్లామ్(35), టెక్టర్(34) టాప్ స్కోరర్స్. సోమవారం ఆట ముగిసే సమయానికి టక్కర్(21), మెక్‌రబినే(5) క్రీజ్‌లో ఉన్నారు. ప్రభాత్ జయసూరియకు ఐదు, ఫెర్నాండోకు రెండు వికెట్లు దక్కాయి.

స్టార్‌కు రూ.78.90కోట్లు మాఫీ: బిసిసిఐ

ముంబయి: స్టార్ ఇండియాకు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) రూ.78.90కోట్లు మాఫీ చేసింది. 2018–2023 మార్చి 31వరకు ఐదేళ్ల కాలానికి స్వదేశంలో జరిగే దేశవాళీ టోర్నీలకు సంబంధించి బిసిసిఐ–స్టార్ మధ్య మీడియా ఒప్పందం 103 మ్యాచ్‌లకు ఒప్పందం కుదుర్చుకుంది. కానీ బిసిసిఐ 102 మ్యాచ్‌లను మాత్రమే నిర్వహించగలిగింది. దీంతో ఒక్క మ్యాచ్ తగ్గడంతో స్టార్ మాఫీని కోరింది. దీంతో బిసిసిఐ 78.90కోట్లను మాఫీ చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68